RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 223 ఆదివారం 7 సెప్టెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

### బంగ్లాదేశ్ ఎగుమతులు భారత్ నుంచి వెళ్లకుండా నిషేధం

న్యూఢిల్లీ : భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాలకు సరుకులు ఎగుమతి చేసుకునేలా బంగ్లాదేశ్‌కు గతంలో ఇచ్చిన వెసులుబాటు(ట్రాన్స్‌షిపమెంట్)ను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. బంగ్లాదేశ్ ఎగుమతులేవీ భారతదేశం గుండా వేరే దేశాలకు వెళ్లకుండా పూర్తిగా నిషేధం విధించింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. బంగ్లాదేశ్‌కు ట్రాన్స్‌షిపమెంట్ వెసులుబాటు కల్పిస్తూ 2020 జూన్ 29న భారత్ సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. బంగ్లాదేశ్ తమ ఉత్పత్తులను భారత్‌లోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్లు, నౌకాశ్రయాలు, ఎయిర్‌పోర్టుల ద్వారా వేరే దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చు.

# భక్తులతో కరచాలనం చేస్తూ... సెల్ఫీలు దిగుతూ



## హుస్సేన్‌సాగర్‌ని ఆకస్మికంగా సందర్శించిన సీఎం

## సామాన్యుడిలా నిమజ్జన వేడుకను వీక్షించిన రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ : ఎలాంటి హంగూ ఆర్భాటాలు ఎక్కువ మంది భద్రతా సిబ్బంది లేకుండా ఒక సామాన్యుడిలా హుస్సేన్‌సాగర్ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం సందర్శించారు. ట్రాఫిక్ నిలిపివేత, వాహనాల దారిమళ్లింపులు లేకుండా కేవలం మూడు వాహనాల కాన్వాయ్, నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా ఎన్టీఆర్ మార్గ్(నెక్లెస్ రోడ్డు)లో ఖైరతాబాద్ వినాయకుడిని నిమజ్జనం చేసిన క్రేన్–4 వద్దకు సీఎం చేరుకున్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తుల మధ్య చేరుకుని... శోభాయమానంగా సాగుతున్న గణనాథుల నిమజ్జన వేడుకను వీక్షించారు. నిమజ్జన ఏర్పాట్ల గురించి సీఎంకు కలెక్టర్ హరిచందన వివరించారు. ఆ తరువాత భక్తులకు అభివాదం చేస్తూ, వారితో కరచాలనం చేస్తూ ఆయన ముందుకు కదిలారు. కొంతదూరం వారితో కలిసి కాలినడకన శోభాయాత్రలో పాల్గొన్నారు. ఏర్పాట్లు ఎలా ఉన్నాయని వారిని ఆరా తీశారు. కారు డోరు వద్ద నిలబడి భక్తులకు అభివాదం చేస్తూ సచివాలయం వరకు వెళ్లారు. వినాయకులకు స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపైకి ముఖ్యమంత్రిని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆహ్వానించారు. కండువా వేసి సన్మానించారు. భక్తులను ఉద్దేశించి మాట్లాడాలని కోరగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. 'గణపతి బప్పా మోరియా' అని నినదించారు.

భక్తులతో కరచాలనం చేస్తూ.. సెల్ఫీలు దిగుతూ ఉత్సాహపరిచారు. శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు కృషి చేస్తున్న అన్ని విభాగాల సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యేవరకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. సీఎం వెంట ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి ఉన్నారు. గతేడాది కూడా నిమజ్జన ఏర్పాట్లను రేవంత్‌రెడ్డి పరిశీలించారు.




హైదరాబాద్ : దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న భారీ నెట్‌వర్క్ మూలాలు హైదరాబాద్‌లో బయటపడ్డాయి. చర్లపల్లిలోని ఓ పరిశ్రమలో మెఫిడ్రిన్ మత్తు పదార్థం తయారు చేస్తున్న ఇద్దరిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. పరిశ్రమలో రూ.11.58 కోట్ల విలువైన 5.96 కిలోల మెఫిడ్రిన్, 35,500 లీటర్ల రసాయనాలు, 950 కిలోల ముడిసరకు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని శుక్రవారం సాయంత్రం అరెస్టు చేయగా.. శనివారం విషయం వెలుగులోకి వచ్చింది. ముంబయిలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న బంగ్లాదేశీ మహిళ అరెస్టు కేసు దర్యాప్తు క్రమంలో ఈ డ్రగ్ తయారీ యూనిట్ బయటపడటం గమనార్హం.

**ఇదీ నేపథ్యం..** మహారాష్ట్రలోని మిరా భయాందార్, వసాయ్ విరార్ కమిషనరేట్ పోలీసులు ఆగస్టు 8న ఓ మహిళ వద్ద 105 గ్రాముల మెఫిడ్రిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లా(23)గా గుర్తించారు. నిందితురాలిచ్చిన సమాచారంతో మరో 10 మందిని అరెస్టు చేసి.. రూ.23.97 లక్షల విలువైన 178 గ్రాముల మెఫిడ్రిన్, ఫోన్లు, కార్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ చర్లపల్లిలోని ఓ పరిశ్రమ నుంచి డ్రగ్స్ వస్తున్నట్లు నిందితుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో మిరా భయాందార్, వసాయ్ విరార్ నేర పరిశోధన విభాగం–4 ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ బృందం రెండు రోజుల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చింది. చర్లపల్లి ఫేజ్–5లోని నవోదయ కాలనీలో వాగ్దేవి ల్యాబొరేటరీస్‌పై ఆకస్మిక దాడి చేయగా డ్రగ్స్ తయారీ యూనిట్ బయటపడింది.

దీని యజమాని వోలేటి శ్రీనివాస్ విజయ్, ఇతని సహాయకుడు తానాజీ పండరీనాథ్ పట్వారీలను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో ట్రాన్సిట్ వారెంట్ తీసుకుని ముంబయికి తీసుకెళ్లారు.

**నాలుగేళ్ల క్రితం లీజు..**రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన వోలేటి శ్రీనివాస్ విజయ్ ఓ ప్రముఖ ఫార్మా కంపెనీలో పనిచేశాడు. చర్లపల్లి నవోదయకాలనీలో జలంధర్‌రెడ్డికి చెందిన భవనాన్ని నాలుగేళ్ల క్రితం లీజుకు తీసుకున్నాడు. వాగ్దేవి ల్యాబొరేటరీస్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి ఫార్మా ఉత్పత్తులు తయారుచేస్తున్నట్లు అందర్నీ నమ్మించాడు. ఆపై గుట్టుగా మెఫిడ్రిన్ తయారీ మొదలుపెట్టాడు.

ఈ డ్రగ్స్‌ను మహారాష్ట్రతో పాటు దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు మిరా భయాందార్, వసాయ్ విరార్ పోలీసు కమిషనర్ నిఖేష్ కౌశిక్ మీడియాకు చెప్పారు. వీరికి విదేశీ లింకులున్నట్లు సమాచారముందని.. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# రైతులకు మరో భారీ శుభవార్త..

## వ్యవసాయ పరికరాల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు!

## లక్షకు 50 వేలు చెల్లిస్తే సరి!




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. ఇప్పటికే రైతు సంక్షేమం కోసం రైతు బీమా, రైతు భరోసా పథకాలను అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వం రైతులకు మరో భారీ శుభవార్త అందించింది.

వ్యవసాయ రంగంలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు పురోగతి సాధించాలంటే అందుకు తగిన విధంగా వ్యవసాయ యంత్ర పరికరాలతో రైతులు సాగు చేయాలని భావిస్తోంది.

**వ్యవసాయ పరికరాల కొనుగోలుకు సబ్సిడీతో రుణాలు...** ఈ క్రమంలోనే నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని తయారుచేసిన అనేక పరికరాలకు బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తుంది. సబ్సిడీ కూడా ప్రభుత్వమే ఇస్తుంది తెలంగాణ ప్రభుత్వం. ప్రభుత్వం అందించే ఈ సబ్సిడీ విధానం వల్ల రైతులు సగం ఖర్చుతోనే ఆధునిక వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది. వ్యవసాయ పరికరాల కొనుగోలు రైతులకు భారం కాకుండా ప్రభుత్వం వారికి 50 శాతం సబ్సిడీతో అందిస్తోంది.

**లక్షకు 50 వేలు చెల్లిస్తే సరిపోతుంది...** స్థానిక ఏఈఓ ల వద్ద రైతులు అవసరమైన పత్రాలు జిరాక్స్ కాపీలను జత చేసి దరఖాస్తు చేసుకుంటే వారికి కావలసిన ఆధునిక యంత్ర పరికరాలు కొనుగోలు చేసేందుకు సబ్సిడీతో ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఉదాహరణకు ఒక రోటవేటర్ కొనుగోలు చేయాలంటే దాని ధర లక్ష రూపాయలు అని అనుకుంటే ఎస్సీ ఎస్టీ మహిళా రైతులు కేవలం 50000 రూపాయలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది.

**వ్యవసాయ పరికరాల కోసం ఇలా చెయ్యండి...** మిగిలిన 50 వేల రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. అదే ఇతర కేటగిరీల రైతులు అయితే 40 శాతం సబ్సిడీని పొందుతారు అంటే వారికి 40 వేల రూపాయల సబ్సిడీ అందుతుంది. వారు 60 వేల రూపాయలు చెల్లించవలసి ఉంటుంది . ఇక వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే రైతులు వ్యవసాయ శాఖాధికారులను సంప్రదించాలి.

**ఈ పత్రాలతో దరఖాస్తులు చేసుకుంటే సబ్సిడీపై పనిముట్లు...** తమ ఆధార్, పాస్ బుక్, బ్యాంకు వివరాలు, సాయిల్ హెల్త్ కార్డులు, ఫోటోలు జతచేసి క్లస్టర్ ఏఈఓ లేదా మండల వ్యవసాయ అధికారి వద్ద దరఖాస్తులు చేసుకోవాలి.

చిన్న సన్నకారు రైతాంగానికి కూడా యంత్ర పరికరాల కొనుగోలుకు సబ్సిడీపై రుణాలు అందిస్తూ తెలంగాణా ప్రభుత్వం రైతన్నకు బాసటగా నిలుస్తుంది.

# డ్యామిట్.. టారిఫ్ కథ అడ్డం తిరిగింది..

## భారత్ దెబ్బకు ట్రంప్ రివర్స్ గేమ్..

### మోడీ, పుతిన్, జిన్‌పింగ్ సమావేశంతో ఉలిక్కిపడ్డ అమెరికా: ఇండియాని పొగుడుతూ ట్వీట్...





యువరటెన్షన్ ప్లీజ్..! ఇండియాతో మేం చేసే వ్యాపారంతో పోలిస్తే, ఇండియా మాతో చేసే వ్యాపారం చాలా ఎక్కువ. సుంకాల దగ్గర మారాం చేస్తే మాకంటే మీరే ఎక్కువ నష్టపోతారు.. తస్మాత్ జాగ్రత్త.. అని పాత సూక్తాన్నే కొత్తగా చెప్పజూశారు అమెరికా ప్రెసిడెంట్. ట్రూత్‌లో ఈ మేరకు ఆయన చేసిన పోస్ట్ రెండుదేశాల మధ్య బిజినెస్ రిలేషన్స్‌ని మళ్లీ చర్చకు పెట్టేశాయి. దశాబ్దాలుగా ఇండియా నుంచి అమెరికాకు ఎక్కువ మొత్తంలో ఉత్పత్తులు ఎగుమతౌతున్నాయ్.. ఇంతటి హాట్ క్లయింట్‌ను ఇండియా దూరం చేసుకుంటే అది వాళ్లకే దురదృష్టం అంటూ సెటైరికల్ డైలాగేశారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. వాళ్లు వేసిన భారీ సుంకాలతో మా వస్తువులు ఇండియాలో అమ్ముకోలేక ఇన్నాళ్లూ ఘోరంగా నష్టపోయాం.. ఇండియాతో వాణిజ్యం పూర్తిగా ఏకపక్ష విపత్తుగా సాగింది, అందుకే ప్రతీకార సుంకాలు వేశాం.. అని తన వాణిజ్య అరాచకాన్ని సమర్థించుకున్నారు ట్రంప్. పైగా, చమురు గానీ, మిలిటరీ ఉత్పత్తులుగానీ ఎక్కువ మొత్తంలో రష్యానుంచే కొనుగోలు చేస్తున్న ఇండియా, ఆ విషయంలో అమెరికాను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పుడు సుంకాలు సున్నాసైజుకు తగ్గిస్తాం అంటూ ఇండియా వైపు నుంచి ఆఫర్ వస్తోందని, కానీ, ఇప్పటికే చాలా ఆలస్యమైందని, ఈ పని ఇండియా కొన్నేళ్ల కిందటే చేయాల్సిందని చెప్పుకొచ్చారు. మోదీ–పుతిన్ భేటీ నేపథ్యంలో ట్రంప్ నుంచి ఇలా బుజ్జగింపు వ్యాఖ్యలు రావడం ఆసక్తికరంగా మారింది. ఇండియాకున్న అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌లలో అమెరికా ఒకటి. గత ఆర్థికసంవత్సరంలో భారత్ నుంచి అమెరికాకు 79.44 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. కానీ, మనదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల విలువ 41.5 బిలియన్ డాలర్లు మాత్రమే. దాదాపు మూడున్నర లక్షల కోట్లు. అమెరికాకు జరిగే ఎగుమతులతో పోలిస్తే ఇది దాదాపుగా సగం. ఈ తేడానే ఎక్స్‌పోజ్ చేస్తూ, మాతోనే మీకు ఎక్కువ అవసరం సుమా అంటూ ఇండియాతో మైండ్‌గేమ్ ఆడుతున్నారు డొనాల్డ్ ట్రంప్. అటు, షాంఘై సహకార సదస్సుకు కొద్ది నిమిషాల ముందు అమెరికా కార్యవర్గం సోషల్ మీడియా ద్వారా ఇండియాను దువ్వడానికి ప్రయత్నించింది. ఇప్పటివరకు భారత్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడిన అమెరికా స్వరంలో సడన్‌గా మార్పు కనిపించింది. భారత్–అమెరికా సంబంధాలు సరికొత్త ఎత్తులకు చేరుకుంటున్నాయి. ఈ నెలలో మా దోస్తీని ఇంకా ముందుకు తీసుకెళ్లే అంశాలపై దృష్టిపెట్టబోతున్నాం... మా ఆర్థికబంధంలోని అద్భుతమైన అవకాశాలను గుర్తించాం.. అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. సుంకాల డ్రామాతో ఇండియాతో తెగిన దౌత్యసంబంధాలను ఏదో విధంగా పునరుద్ధరించుకోవాలన్నదే అమెరికా ప్రయత్నంగా తెలుస్తోంది. అయినా, నరం లేని ట్రంప్ నాలిక మీద మనోళ్లకు ఎప్పుడో నమ్మకం పోయింది.

# సంపాదకీయం

## ఇక నో డిఫెన్స్... ట్రంప్ కొత్త నిర్ణయం : కారణమిదే..?

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విధానాలపై తీసుకున్న నిర్ణయాలు ఎప్పుడూ చర్చనీయాంశాలయ్యాయి. ఆయన రాజకీయ ధోరణి దూకుడుగా ఉండటం వల్ల దేశీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ వేదికలపైనా ప్రభావం చూపింది. తాజాగా ట్రంప్ తీసుకున్న మరో కీలక నిర్ణయం మళ్లీ వివాదాలకు దారి తీస్తోంది. రక్షణ శాఖకు ఉన్న ప్రస్తుత పేరు స్థానంలో, ఒకప్పుడు వినియోగించిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' అనే పాత పేరును మళ్లీ ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు.

**యుద్ధ విభాగం నుంచి మార్పులు..** అమెరికా పాలనా వ్యవస్థలో రక్షణ శాఖకు విశేషమైన చరిత్ర ఉంది. 1789లో అప్పటి పాలకులు మొదటిసారిగా 'యుద్ధ విభాగం' ఏర్పాటైంది. చేశారు. ఆ సమయంలో సైన్యం, నావికాదళాన్ని పర్యవేక్షించే 'యుద్ధ కార్యదర్శి' అనే పదవి ఉండేది. అయితే కాలక్రమంలో భద్రతా అవసరాలు మారాయి. 1798లో ప్రత్యేక నేవీ విభాగం ఏర్పడింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, 1947లో అమలులోకి వచ్చిన నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ ద్వారా అమెరికా సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించారు. నాటి ప్రెసిడెంట్ హ్యారీ ట్రూమన్ సైన్యం, వైమానిక దళాన్ని సరి కొత్త రూపంలో ఏర్పాటు చేశారు. చివరికి 1949లో మూడు విభాగాలను కలిపి "డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్" అనే పేరు పెట్టారు. అప్పటి నుంచి రక్షణ శాఖ పేరుతోనే అమెరికా సైనిక శక్తి కొనసాగుతోంది. ట్రంప్ ప్రకారం, "డిఫెన్స్" అనే పదం రక్షణాత్మక భావనను ఇస్తుందని, కానీ అమెరికా చరిత్రలో ఆగ్రెసివ్ వైఖరితోనే విజయాలు సాధించిందని అంటున్నారు. ఆయన దృష్టిలో "వార్" అనే పదం శక్తి, ఆధిపత్యం, గెలుపును సూచిస్తుంది. అదే కారణంగా పాత పేరును తిరిగి ఉపయోగించాలనే ఆలోచనను ముందుకు తెచ్చారు. ఆయన వ్యాఖ్యల ప్రకారం, ప్రపంచ యుద్ధాల్లో అమెరికా సాధించిన విజయాలు "డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్" పేరుతోనే సాధించబడ్డాయని భావనను ఆయన బలపరుస్తున్నారు.

**రాజకీయ, వ్యూహాత్మక ప్రభావాలు...** ఈ పేరు మార్పు కేవలం ఒక నామమాత్రపు అంశం కాదు. అంతర్జాతీయ స్థాయిలో ఇది అమెరికా వైఖరిని మరోసారి మిలిటరైజేషన్ దిశగా నడిపించే సంకేతంగా భావించబడుతోంది. "రక్షణ" అనే పదం కంటే "యుద్ధం" అనే పదం ఎక్కువ దూకుడు, శక్తివంతమైన మిలిటరీ ఇమేజ్‌ను ఇస్తుంది. ఫలితంగా మిత్రదేశాలకే కాకుండా, ప్రత్యర్థి దేశాలపై కూడా ఇది మానసిక ఒత్తిడిని కలిగించే అవకాశం ఉంది. మరోవైపు, విమర్శకులు మాత్రం ఈ నిర్ణయం అమెరికా శాంతి, భద్రతకు అనుకూలంగా ఉండదని, కేవలం రాజకీయ ప్రదర్శన కోసం తీసుకున్న అడుగని భావిస్తున్నారు.

**అమలులోకి వచ్చేనా?...** అయితే డొనాల్డ్ ట్రంప్ తెర మీదకు తెచ్చిన ఈ ప్రతిపాదన నిజంగా అమలులోకి వస్తుందా లేదా అనేది చూడాలి. అయితే ఈ ఆలోచన ఇప్పటికే రాజకీయ చర్చలకు దారితీస్తూ, అమెరికా భవిష్యత్ సైనిక దిశ ఏవైపు కదులుతుందన్న ప్రశ్నను మళ్లీ లేవనెత్తింది.

# ఆహార శుద్ధి.. కొరవడిన చిత్తశుద్ధి



పెద్దపల్లి : జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు ముందుకు పడటంలేదు. ఔత్సాహిక యువతకు ఉపాధి కల్పించి, ఉత్పత్తులు చేయాలనే ప్రభుత్వం సంకల్పం నెరవేరడంలేదు. అందుబాటులోని కొంత భూముల సేకరణ తప్ప అవసరమైన స్థలాల లభ్యత సేకరించడంలో జాప్యం నెలకొంది. మౌలిక వసతుల అభివృద్ధి పనుల ఊసే కనిపించడలేదు. జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలోని జిల్లాలో పరిశ్రమలు విరివిగా స్థాపిస్తే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**ఇదీ అసలు సమస్య**

ఆహారశుద్ధి పరిశ్రమలకు కనీసం 400 ఎకరాల్లోపు ఉండాలి ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో 102 ఎకరాలు గుర్తించారు సమీప ప్రాంత రైతులు మరికొన్ని భూములు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదు సంబంధిత అధికారులు రైతులను ఒప్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి అందుబాటులోని భూముల్లో పరిశ్రమలు నెలకొల్పే చర్యలు చేపట్టడంలేదు

**ఎక్కడి పనులు అక్కడే**

జిల్లాలో సుమారు 2.70 లక్షల ఎకరాల్లో వరి, మిర్చి, పసుపు, మొక్కజొన్న, కూరగాయల సాగు చేస్తున్నారు. వ్యవసాయరంగ పరంగా ఏటా రెండు పంటల్లో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. రైస్ మిల్లులు, బియ్యంతో తయారయ్యే తినుబండారాలు, ఇతరత్రా ఉత్పత్తుల తయారీ పరిశ్రమలతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ) ర్యాకల్‌దేవ్‌పల్లిలో గుర్తించిన స్థలాల్లో పరిశ్రమల స్థాపనకు అవసరమైన రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్తు వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

**యువతకు నిరాశే**

ఒకేచోట భారీగా భూసేకరణ అవసరం కానుండటంతో లభ్యత కొంత ఇబ్బందిగా ఉంది. అందుబాటులోని స్థలాల్లో ఆహార పరిశ్రమలు ఏర్పాటుచేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జిల్లాలో ఔత్సాహిక యువత దీనికోసం నిరీక్షిస్తున్నారు. భూసేకరణ అయిన స్థలాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.

# ఆడించేది ఒకే ఒక్కడు



పెద్దపల్లి : వ్యాయామ విద్య పటిష్టంగా లేక క్రీడాకారుల ప్రతిభ మసక బారుతోంది. అపారమైన ప్రతిభ ఉన్నా లక్ష్య చేధనలో గురి తప్పుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా వనరులు, ప్రోత్సాహం లేక నైపుణ్య శిక్షణ కొరవడుతోంది. ఏళ్ల తరబడి వాటి ఖాళీల భర్తీలో ఉదాసీనత నెలకొంది. ఉమ్మడి జిల్లాలో ఒకే ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు(పీడీ) ఉన్నారంటే ఆటలపై ఎంత నిర్లక్ష్యమో స్పష్టంగా కనిపిస్తోంది. శారీరక, మానసిక ప్రశాంతత, ఉత్తమ భవితకు బాటలు వేసేలా వ్యాయామ విద్యను బలోపేతం చేస్తేనే క్రీడా ప్రతిభ వికసించనుంది.

**పరిస్థితికి కారణమిదే**

పాఠశాలల్లోని పీడీలకు పదోన్నతి కల్పిస్తే కళాశాలలకు వెళ్లనున్నారు.
ఏకీకృత సర్వీసు నిబంధనలతో పదోన్నతులు లేవు.
పదేళ్లుగా పదోన్నతులు కల్పించకపోవడం, ఉన్నవారు ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీలు భర్తీకి నోచుకోవడంలేదు.
పాఠశాల స్థాయిలో కొందరు ఆటలపై పట్టు సాధించి జూనియర్ కళాశాలల్లో రాణించాలనే లక్ష్యం నెరవేరడంలేదు.

అండర్ 19 పోటీలకు దూరం


ఉమ్మడి జిల్లాలోని 50 కళాశాలల్లో 15,948 మంది చదుతున్నారు. అయితే కరీంనగర్ జిల్లాలో మాత్రం ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో కళాశాలల్లో అండర్-19 పోటీలకు చాలామంది దూరమవుతున్నారు. గల్లీ నుంచి మొదలుకొని మైదానాల వరకు క్రికెట్‌కు మోజు పెరగడంతో కళాశాలల్లో భిన్న పరిస్థితి నెలకొంది. కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభావంతులైనవారు ఉన్నప్పటికి సరైన శిక్షకులు లేకపోవడంతో సాధన ప్రశ్నార్థకంగా మారింది. ఆటల పోటీ ఊసే కనిపించడంలేదు. విద్యార్థుల ఉత్సాహాన్ని గుర్తించిన కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటుగా శిక్షణ ఇప్పిస్తున్నారు.

**ఇలా చేస్తేనే క్రీడా వికాసం**

ప్రతి కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించడం
ఆటలను ప్రోత్సహించేలా అకాడమీ, అసోసియేషన్ల ఏర్పాటు
చదువుతోపాటు వ్యాయామ విద్యను నిర్బంధంగా మూల్యాంకనం చేయడం
ఆటలతోపాటుగా చదువులోనూ ముందుంటే ఉద్యోగ సాధనకు, తద్వారా జీవనోపాధికి క్రీడలు దోహదపడతాయని అవగాహన కల్పించడం.

ఉమ్మడి జిల్లా వివరాలు
కళాశాలలు: 50
విద్యార్థులు: 15,948
ఫిజికల్ డైరెక్టర్లు: 1

# ట్యాంకులు పూర్తవలే.. పైపులు నీరివ్వలే!



కోరుట్ల : శివారు గ్రామాలను పురపాలికల్లో విలీనం చేయడంతో పట్టణాల విస్తీర్ణం పెరుగుతుండగా ఇందుకు తగ్గట్టుగా వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనాభాకు సరిపడా తాగునీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2023లో అమృత్ 2.0 పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న పథకంలో చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో జిల్లాలోని అయిదు పట్టణాల్లో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**రూ.127 కోట్లతో నిర్మాణాలు**

ప్యాకేజీ-1 కింద జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాలను ఎంపిక చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్యాంకుల నిర్మాణం, ప్రధాన పైప్‌లైన్, కొత్త కాలనీల్లో అంతర్గత పైప్‌లైన్లు, కుళాయిల బిగింపు పనులకు అంచనాలు రూపొందించారు. ఇందుకోసం అయిదు పట్టణాలకు కలిపి మొత్తం రూ.127 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారులు టెండర్లలో పనులు దక్కించుకొని ఏడాది దాటింది. నెలల తరబడి జాప్యం చేసి కొద్ది నెలల కిందట ట్యాంకుల నిర్మాణం ప్రారంభించినా కొన్ని చోట్ల స్థల సమస్యలతో పనులు జరగడం లేదు. ఇటీవల ప్రారంభమైన పైప్‌లైన్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు పైపులు వేయడానికి సీసీ రోడ్లను తవ్వుతుండటంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయిదారేళ్ల కిందటే మిషన్ భగీరథ పథకంలో తవ్వి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారని, మళ్లీ ధ్వంసమైతే ఎలా నడవాలని ప్రశ్నిస్తున్నారు.

**సా..గుతున్న నిర్మాణాలు**

జగిత్యాల పట్టణంలో 3 ట్యాంకులు, ఒక సంపు నిర్మించాల్సి ఉండగా రెండు ట్యాంకుల నిర్మాణం కొనసాగుతోంది. మొత్తం 31 కి.మీ.ల పైప్‌లైన్ నిర్మించాల్సి ఉండగా 6.5 కి.మీ.ల మేర పనులు పూర్తయ్యాయి.
కోరుటలో ఒక ట్యాంకు నిర్మాణం పూర్తయింది. 40 కి.మీ.ల పైపులైన్ వేయాల్సి ఉండగా 6.3 కి.మీ.ల పనులు పూర్తి చేశారు.
మెట్‌పల్లి పట్టణ పరిధిలోని ఆరపేటలో ట్యాంకు నిర్మాణం చేపట్టగా స్థల సమస్యతో పనులు నిలిపివేశారు. మరో చోట నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించారు. మొత్తం 29 కి.మీ.ల పైప్‌లైన్ వేయాల్సి ఉండగా 8 కి.మీ. పనులు పూర్తి చేశారు.
రాయికల్‌లో రెండు ట్యాంకుల నిర్మాణానికి స్థల సమస్య నెలకొంది. 20.76 కి.మీ.లు పైపులైన్ వేయాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదు.
ధర్మపురిలో రెండు ట్యాంకులు నిర్మించడంతో పాటు 23 కి.మీ.లమేర పైపులైన్లు వేయాలి. ట్యాంకుల పనులు సగం వరకు పూర్తికాగా 5 కి.మీ.ల మేర పైపులైన్ వేశారు.

# చినుకు పడితే.. వణుకే..!

జాజిరెడ్డిగూడెం చినుకు పడితే చాలు.. ఆ చిన్నారులు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకుని రాత్రంతా బిక్కుబిక్కుమంటూ.. తెల్లవారు జామును ఇంటి బాట పట్టాల్సి వస్తోంది. ఇదీ అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినుల దయనీయ పరిస్థితి.. కేజీబీవీని పన్నెండేళ్ల కిందట కుంట పక్కనే నిర్మించారు. గతంలో వర్షం వస్తే వరద సాఫీగా వెళ్లడంతో ఎలాంటి సమస్య తలెత్తలేదు. ప్రధానంగా అర్వపల్లిలో రెండు జాతీయ రహదారుల రాకతో రోడ్లు ఎత్తుగా నిర్మించగా, నీళ్లు వెళ్లడానికి కాల్వలు ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదు. దీంతో మూడేళ్ల నుంచి సమస్య తీవ్రమైంది. గతేడాది వానాకాలంలో కురిసిన వర్షానికి విద్యాలయం ఆవరణ నిండి విద్యార్థులు భవనంలోనే చిక్కుకుపోయారు. అధికారులు అప్రమత్తమై బాలికలను మోసుకుని



నీళ్లలోంచి బయటకు పంపించారు. తాజాగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి నీరు చుట్టుముట్టింది. దీంతో విద్యార్థులందరినీ ఇళ్లకు పంపించారు.

**కన్నవారు లేక.. ఎటు వెళ్లాలో తెలియక...**

కస్తూర్బాలో పేద పిల్లలే ఎక్కువగా చదువుకుంటున్నారు. అందులో తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు దూరమైన బాలికలు 20 మంది వరకున్నారు. ఇక కన్నవారు ఉపాధి పనులకు ఇతర ప్రాంతాలకు వలసెల్లిన చిన్నారులు సైతం ఉంటున్నారు. దీంతో వర్షం పడిన ప్రతిసారి వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. అలాంటి విద్యార్థులను ఇళ్లకు పంపించాలన్నా, తల్లిదండ్రులు బడికి రావాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నారు. సమీప బంధువులు వచ్చి తీసుకెళ్తున్నారు. డీఈవో అశోక్, జీసీడీవో పూలన్‌లు శుక్రవారం విద్యాలయానికి వచ్చి విద్యార్థుల ఒదరినీ పంపించారు. ఒక విద్యార్థినికి తల్లిదండ్రులు లేకపోవడం, ఆమె బంధువు తన అత్త సంరక్షణలో ఉండటంతో రాలేదు. దీంతో సాయంత్రం వరకు ఆ విద్యార్థినిని పంపించడానికి అష్టకష్టాలు పడ్డారు. వర్షం వచ్చినపుడల్లా ఇదే పరిస్థితి అని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎస్‌వో నాగరాణి చెప్పారు.

# 'సరి'కొత్తగా చేయూత!

ఖమ్మం : నూతనంగా ఏర్పడిన మత్స్య సహకార సంఘాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత ఇవ్వనుంది. ఒక్కో సంఘానికి రూ.3లక్షల చొప్పున మంజూరు చేస్తుంది. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి(ఎన్ఎఫ్‌డీబీ) కింద తొలిసారిగా ఈ నిధులు కేటాయిస్తుండటం విశేషం. గతంలో ప్రభుత్వం కొత్త మత్స్య సహకార సంఘాల కోసం మార్గదర్శకాలు వెలువరించింది. సహకార చట్టం కింద నమోదుచేసి, పాలకవర్గాలను ఎన్నుకోవాలని సూచించింది. ఈమేరకు తెలంగాణలో కొత్తగా 311 సంఘాలను రాష్ట్ర మత్స్యశాఖ ఏర్పాటు చేసింది. వాటిని కేంద్ర బృందాలు తనిఖీ చేసి నిబంధనలకు అనుగుణంగా ఉన్న 67 సంఘాలను గుర్తించాయి. 2023, 2024లో నమోదైన సంఘాలకు మాత్రమే ఆర్థికసాయమందించాలని కేంద్రం నిర్ణయించింది. ఈలెక్కన ఖమ్మం 18, భద్రాద్రి జిల్లాలో ఏడు సంఘాలకు లబ్ధి కలగనుంది.

**ఒక్కో సంఘానికి రూ.3 లక్షలు**

ఖమ్మం జిల్లాలో తనగంపాడు, వందనం, బుర్హాన్‌పురం గణేశ్‌నగర్, కుప్పెనకుంట్ల, గోవింద్రాల, మాణిక్యారం, హస్నాబాద్, రామన్నపాలెం, తీర్థాల, విశ్వనాథపల్లి, ఊటుకూరు, భావన్నపాలెం, సందర్లగూడెం సూర్యాతండా, గోపాలపేట, మాదాపురం, ఎర్రబోడు, బల్లేపల్లి, జోగ్గూడెం, భద్రాద్రి జిల్లాలో మర్రిగూడెం, పాములపల్లి, పెద్దిరెడ్డిగూడెం, ఊటుపల్లి, గణేశ్‌పాడు, ఆసుపాక, నాచారం మత్స్య సహకార సంఘాలకు ఆర్థిక సాయం అందనుంది. మొదటి విడతలో రూ.లక్ష చొప్పున, రెండో విడతలో రూ.2లక్షల చొప్పున మంజూరవుతాయి. కంప్యూటర్లు, సామగ్రి తదితరాల కొనుగోలు, వ్యాపారాభివృద్ధి కోసం సంఘాలు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ఒక్కో సంఘంలో 35-50 మంది సభ్యులు ఉంటారు. తొలి విడతలో మంజూరైన సొమ్మును సక్రమంగా వినియోగించినట్లు తనిఖీలో తేలిన తర్వాతే రెండో విడత నిధులను ప్రభుత్వం కేటాయించనుంది. ఇందుకోసం ప్రతి మూడు నెలల పనితీరును పరిగణనలోకి తీసుకుంటుంది. వలలు, తెప్పలు, ఇతర పరికరాలను కొనేందుకు సంఘాల్లోని సభ్యులకు నిధులు మంజూరుచేస్తే వేలాది కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని మత్స్యకారులు కోరుతున్నారు. 'ప్రభుత్వం కేటాయించే నిధులను మత్స్య సహకార సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి. సంఘాల అభివృద్ధికి వెచ్చించాలి' అని ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్‌కు తెలిపారు.

# మేల్కొందామా.. పుడమికి మేలు చేద్దామా..

ఖమ్మం : రోజురోజుకూ ప్లాస్టిక్ మహమ్మారి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా నగరపాలిక/పురపాలికలకు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్ ప్లాస్టిక్)ను పూర్తిస్థాయిలో



నివారించేందుకు ఇప్పటికే సిబ్బంది జరిమానాలు విధిస్తున్న విషయం విదితమే. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రజలు ఇతర వస్తువులను వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సర్కారు నిర్దేశించింది. ప్రత్యామ్నాయ వస్తువులను ఉచితంగానే అందించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర వర్గాలను భాగస్వాములను చేయాలని సూచించింది.

**ఉభయ జిల్లాల్లో 4 కేంద్రాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం రొంపేడు, కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలో చుంచుపల్లి, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో రఘునాథపాలెం, కూసుమంచి మండలం పాలేరులో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.50లక్షలు కేటాయిస్తుంది. రొంపెడ, చుంచుపల్లిలో ఇదివరకే స్థల సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. రఘునాథపాలెం, పాలేరులో స్థల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఖమ్మం నగరంలో ఇప్పటికే బయోమైనింగ్ విధానం అమలవుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుతో మరింత ప్రయోజనం చేకూరనుంది.

## ఈసారి ముందస్తుగా సన్నద్ధత

నేలకొండపల్లి : విద్యార్థుల భవితకు తొలిమెట్టు పదో తరగతి. ఇందులో మంచి మార్కులు సాధిస్తే ఎన్నో అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సెప్టెంబరు 1 నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించారు. ఏటా జనవరి నెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించటంతో పది ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు వెనకబడుతున్నారు. ఈ విషయం గమనించిన రాష్ట్ర పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సెప్టెంబరు నెల నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో సోమవారం నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.

**ఉదయం, సాయంత్రం నిర్వహణ**

రోజువారీగా ఉదయం 8 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ఏ రోజు ఏ సబ్జెక్టు చదవించాలో షెడ్యూల్ విడుదల చేశారు. వారంలో సోమవారం ఉదయం సాంఘికశాస్త్రం, సాయంత్రం తెలుగు, మంగళవారం ఉదయం తెలుగు, సాయంత్రం హిందీ, బుధవారం ఉదయం బయాలజీ, సాయంత్రం ఇంగ్లిష్, గురువారం ఉదయం ఇంగ్లిష్, సాయంత్రం గణితం, శుక్రవారం ఉదయం మ్యాథ్స్, సాయంత్రం ఫిజికల్ సైన్స్, శనివారం ఉదయం ఫిజికల్ సైన్స్, సాయంత్రం సోషల్ స్టడీస్ చదివించాలి. సందేహాల నివృత్తికి ఆయా సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి.

**వచ్చే నెల 10లోపు..**



పదో తరగతి సిలబస్ అక్టోబరులో 10వ తేదీలోపు పూర్తి చేయాలి. ఈ క్రమంలో తరగతుల నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రివిజన్ తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలి. ప్రత్యేక తరగతులకు వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి. ప్రత్యేక తరగతులను తరగతి గదిలో మాత్రమే నిర్వహించాలి. గ్రీన్‌బోర్డులతో పాటు డిజిటల్ బోర్డులను ఉపయోగించాలి. బృంద చర్చలు చేసుకొనే వెసులుబాటు కల్పించాలి.

ఉన్నత పాఠశాలలు
ఖమ్మం: 227
భద్రాద్రి: 124

విద్యార్థులు
ఖమ్మం: 1,231
భద్రాద్రి: 9,702


జిల్లాల వారీగా పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంఈఓలతో పాటు ఆయా ప్రధానోపాధ్యాయులకు సమాచారాన్ని అందించాం. వంద శాతం ఫలితాల కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా శ్రమిస్తాం. అల్పాహారం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బి.నాగలక్ష్మి, డీఈఓ, భద్రాద్రి

## కరకట్టతోనే తప్పేను వరద తిప్పలు

ధర్మపురి: ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ధర్మపురి పట్టణవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తుంటారు. లోతట్టు ప్రాంతాల కాలనీవాసులు భారీ వర్షాలుపడితేచాలు ముల్లేమూట సర్దుకొని బతుకు జీవుడా అంటూ పునరావాస కేంద్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. భారీ వర్షాల సమయంలో ధర్మపురి పట్టణంలోకి వరద నీరు వస్తుండటమే ఇందుకు కారణం. సమస్య నివారణకు కరకట్ట నిర్మించాని ఏళ్లుగా చర్చ జరుగుతుంది. ఇప్పటివరకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదు.

**ఒడ్డులకు కోతతో..**

గోదావరి నది దమ్మన్నపేట నుంచి ధర్మపురి తీరానికి ప్రవేశించే సమయంలో దక్షిణాభిముఖంగా ప్రవహిస్తుంది. ఇక్కడ దశాబ్దాల కిందట సహజసిద్ధంగా ఒండ్రు మట్టితో గుట్టలగా ఉండేది. ఇదంతా వరదలకు కొట్టుకుపోయింది. ధర్మపురి వద్ద నదిలో గండ శిలలు(బండరాళ్లు) ఎత్తుగా నీటికి అడ్డుగా ఉండేవి. ఇసుక కూడా విపరీతంగా ఉండేది. ఎంత వరద వచ్చినా పట్టణంలోకి ప్రవేశించకుండే ఇవి ఆపేవి. బండరాళ్లు కొల్లకొట్టడం, ఇసుక అక్రమ రవాణాతో ధర్మపురి పట్టణంలోకి వేగంగా వరద వస్తోంది. పట్టణానికి ఈశాన్యభాగంలో



మఠం రేగడి భూముల గడ్డ కూడా మాయం కావడంతో వరదకు అడ్డులేకుండా పోయింది.

**ముప్పు ఎక్కడంటే..**

కుమ్మరి, బ్రాహ్మణసంఘం వాడ, శ్రీరామాలయం, శ్రీదత్తాత్రేయస్వామి ఆలయం, మంగళిగడ్డ, బోయెవాడ, ఒడ్డెరకాలనీలు గోదావరి వరద ముప్పు ప్రాంతాలు. నదిలో నీటిమట్టం పెరిగిందంటే ఈ కాలనీల వీధులు జలమయంగా మారుతాయి. 2022లో భారీ ఎత్తున వరదలు రావడంతో వారం రోజుల పాటు పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. 1995లో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు గండి పడటంతో గోదావరిలోకి పది లక్షల క్యూసెక్కులు రావడంతో పై ప్రదేశాలను వరదలు ముంచెత్తాయి. బాధితుల కట్టుబట్టతోనే మిగిలారు. అపారనష్టం వాటిల్లింది.

**మోక్షం ఎప్పుడు?** ధర్మపురి గోదావరి తీరంలో సుమారు 2 కి.మీల మేర కరకట్ట నిర్మించాల్సి ఉంది. 2022లో అప్పటి ప్రభుత్వానికి పురపాలక సంఘం రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. ఎన్నికలు రావడంతో అక్కడితోనే ఆగిపోయారు. దమ్మన్నపేట చివరి ప్రాంతం నుంచి ధర్మపురి మహాలక్ష్మీ పుష్కరఘాట్ వరకు కరకట్ట నిర్మించినట్లయితే నీరు పట్టణంలోకి రాకుండా రక్షణ గోడలాగా ఉంటుంది. రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

## విద్యార్థులకు చదువు.. ప్రజలకు సేవలు




తాండూరు : కొడంగల్ వైద్య కళాశాలకు 50 వైద్య సీట్లు కేటాయిస్తూ జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించింది. తాజాగా జరుగుతున్న కౌన్సెలింగ్‌లోనే విద్యార్థులు ఇక్కడికి రానున్నారు. ఆల్ ఇండియా, రాష్ట్ర కోటాలో మొత్తం సీట్లు భర్తీ చేయనున్నారు. వైద్య కళాశాలను తాండూరు జిల్లా ఆస్పత్రిలో కొనసాగించేందుకు ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధీనంలోకి తీసుకుంది. అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ప్రొఫెసర్లు విధుల్లో చేరగా, బోధన నిపుణులు త్వరలో రానున్నారు. అత్యవసర చికిత్స ఇక్కడే: అత్యవసర, ప్రత్యేక చికిత్సలు అవసరమైతే జిల్లా ప్రజలు హైదరాబాద్‌కు పరుగులు తీసేవారు. మెరుగైన వైద్యం అందాలంటే ప్రైవేటుకో లేక ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పంపించేవారు. ఇక నుంచి ఈ కష్టాలు దూరం కానున్నాయి. తాండూరు జిల్లా ఆస్పత్రిలోనే అత్యవసర, వివిధ రకాల ప్రత్యేక సేవలు అందనున్నాయి. ఇందుకోసం దవాఖానాకు అవసరమైన పరికరాలు, లిఫ్టింగ్ మంచాలు, రోగ నిర్ధారణ, చికిత్సలకు అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలను సమకూర్చారు. ఆచార్యులు, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందించే శస్త్రచికిత్సలు తాండూరులోనే అందనున్నాయి. చిన్నారులు, ఫిజియోథెరపీ, కళ్లు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, ఎముకలు, మహిళా సంబంధమైన చికిత్సలు, మానసిక, మెదడు, నరాలు, వివిధ రకాల ప్రత్యేక శస్త్రచికిత్సలు, అవసరమైన రక్త పరీక్షలు, అన్ని రకాల చికిత్సలు జరగనున్నాయని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు కు వివరించారు.

**రూ.27 కోట్లతో..** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో రూ.27 కోట్ల వ్యయంతో వైద్య కళాశాల కొత్త భవన నిర్మాణం కొనసాగుతోంది. అప్పటివరకు కళాశాలను తాండూరు జిల్లా ఆస్పత్రిలో నిర్వహించనున్నారు.

ఇక్కడ ప్రతి రోజు 800పైగా రోగులు వైద్యం చేయించుకుంటున్నారు. కళాశాల నిర్వహణ నేపథ్యంలో వైద్య విద్యార్థులకు బోధనతోపాటు, ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాల ప్రజలతో పాటు సరిహద్దు కర్ణాటకకు చెందిన రోగులు సైతం తాండూరు ఆస్పత్రికి వస్తారు. ఇక నుంచి రోజువారీగా వచ్చేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. వైద్య విద్యార్థుల వసతికి తాండూరు మైనార్టీ విద్యాలయ భవనాన్ని తాత్కాలికంగా సమకూర్చారు.

## శిథిలావస్థలో ఉన్నా.. తిష్ఠవేశారు!



హుజూరాబాద్ : హుజూరాబాద్ పట్టణ సమీపంలోని ప్రభుత్వానికి చెందిన కేసీక్యాంపు భవనాల్లో పలువురు అక్రమంగా నివాసం ఉంటున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం క్వార్టర్లను నిర్మించగా.. అప్పట్లో నీటిపారుదలశాఖకు చెందిన వందలాది ఎస్సారెస్పీ ఉద్యోగులకు కేటాయించారు. తదనంతరం నీటిపారుదల శాఖలోని పలు విభాగాలను హుజూరాబాద్ నుంచి తరలించటంతో ఇక్కడ కొందరే ఉద్యోగులు మిగిలారు. కేసీక్యాంపు క్వార్టర్లలో చాలా వరకు శిథిలావస్థకు చేరటంతో మెరుగ్గా ఉన్న వాటిని వారికి కేటాయించారు. అయితే ఉద్యోగకాలం ముగిసిన క్వార్టర్ల నుంచి ప్రస్తుతం వారు కదలటం లేదు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కొందరు ఉద్యోగుల సంబంధీకులు కూడా తిష్టవేశారు. సంబంధిత అధికారులు వారి పేరిట చెల్లింపులు చేస్తున్నారు. వారందరిని ఖాళీ చేసి.. ఈ భవనాలను పూర్తిస్థాయిలో తొలగించటానికి అధికారులు వారికి పలుమార్లు కోర్టు నోటీసులు అందజేసిన లాభం లేదు.

**ప్రమాదకరమని తెలిసినా..**

దాదాపు 30 విశ్రాంత ఉద్యోగుల, ఉద్యోగుల సంబంధీకుల కుటుంబాలు క్వార్టర్లలో నివాసం ఉంటున్నాయి. ఆ భవనాలు పెచ్చులూడి కూలిపోయే స్థితికి చేరిన వారు బయటకి రావటం లేదు. శిథిలావస్థకు చేరి, పగుళ్ల బారిన పడి, పిచ్చిమొక్కలతో దుర్భరంగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ చేయకుండా కొందరు ఉన్నతాధికారులతో ఈఈ, డీఈ స్థాయి అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భవనాల్లో దర్జాగా ఉంటున్నా అధికారులు నోరు మెదపకపోవటం గమనార్హం. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు చొరవచూపాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై సంబంధిత డీఈ రాయబారపు ప్రసాద్‌ను వివరణ కోరగా.. క్వార్టర్లలో నివాసముండే వారిని బయటకు పంపించేందుకు.. నీటిసరఫరా, విద్యుత్తు సేవలను నిలిపి వేశామని.. అయినా వారు కదలడం లేదన్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటం బాధాకరమని, ఉన్నతస్థాయి అధికారుల చొరవ అవసరమని చెప్పారు.

## పంచాయతీలపై కేంద్రం పర్యవేక్షణ



గోదావరిఖని: గ్రామ పంచాయతీల బలోపేతానికి కేంద్రం దృష్టి సారించింది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. పంచాయతీల నిర్వహణ, అభివృద్ధితో పాటు సిబ్బంది వేతనాల చెల్లింపు అంశాల్లో నిధుల కొరత వెంటాడుతోంది. పంచాయతీలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 'సమర్థ్ వెబ్ పోర్టల్'ను ప్రారంభించింది. దీని ద్వారా పంచాయతీల పాలనతో పాటు అభివృద్ధికి సంబంధించిన అంశాలను కేంద్రం పర్యవేక్షించనుంది. గ్రామ పంచాయతీలకు పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా సాధారణ నిధి సమకూరుతోంది. జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రస్తుతం పర్యవేక్షణ లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించి ఈ పోర్టల్‌ను వినియోగించుకొని బలోపేతం చేయనుంది.

**నిధులు మళ్లించకుండా నిఘా**

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పనులకు మళ్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకే పోర్టల్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. కేంద్రం కేటాయిస్తున్న నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు చేరే విధంగా పర్యవేక్షించనుంది. ఇతర రాష్ట్రాల్లో ఇదివరకే ఈ పోర్టల్‌ను ఏర్పాటు చేసి సమర్థంగా పంచాయతీల పనితీరును మెరుగుపర్చింది. అదే విధంగా ఈ పోర్టల్‌ను తాజాగా ఏర్పాటు చేసి నిధుల వెచ్చింపుతో పాటు ఆర్థిక పరిపుష్టికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, సలహాలను అందించనుంది.

**సలహాలు.. సూచనలు** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సలహాలు సూచనలు అందించనుంది. డిజిటల్ వేదిక ద్వారా నేరుగా పంచాయతీలను పర్యవేక్షించడంతో పాటు మరింత బలోపేతం చేసేందుకు పంచాయతీరాజ్ నిపుణులతో అధ్యయన కమిటీని నియమించింది. సొంత ఆదాయ వనరులు పెరుగుదలకు ఆచరణీయమైన నమూనాను రూపొందించనుంది. ఉమ్మడి జిల్లాలో 1214 గ్రామ పంచాయతీలున్నాయి. రానున్న కాలంలో ఇవి మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది.

## ముందు'చూపు' ఎంతో మేలు

నిజామాబాద్ : అన్ని అవయవాల్లో నేత్రాలు ఎంతో ముఖ్యమైనవని.. చూపును కాపాడుకోవాలని ఇన్‌ఛార్జి ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు ఎం.సాయారెడ్డి విద్యార్థులకు సూచించారు. చిన్నప్పట్నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. లయన్స్ క్లబ్ నిజామాబాద్ సెంట్రల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నేత్ర వైద్యశాల వైద్యులు డా.సుప్రజ, డా.భుజంగరెడ్డి, లక్ష్మీనర్సయ్య 160 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. కంటిచూపును కాపాడుకోవాలంటే ఫోన్లకు దూరంగా ఉండాలని వారు సూచించారు. 36 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించిన నిర్వాహకులు.. త్వరలో ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో అస్మా జరీన్, సుజాత, ప్రమీత పాల్గొన్నారు.



## ములాఖత్‌లు.. ముడుపుల లెక్కలు

నిజామాబాద్ : నిజామాబాద్ నగరపాలక సంస్థను అవినీతి చీడ వదలడం లేదు. లంచావతారుల్లో ఎవరో ఒకరు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతూనే ఉన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌లో రోజుల పాటు దస్త్రాలు ముందుకు కదలడం లేదన్న ఆరోపణలున్నాయి. నగరపాలకంలో పలు విభాగాల్లో పనుల కోసం ప్రజలు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అయినా ఫైళ్లు ముందుకు కదలవు. చివరకు లాభం లేదనుకుని దళారులను లేదా కొందరు ప్రైవేటు లైసెన్స్‌డ్ ఇంజినీర్లను బాధితులు ఆశ్రయిస్తున్నారు. వారు అడిగినంత ముట్టజెబితే మాత్రం పనులు పూర్తవుతున్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో సాయంత్రం విధులు పూర్తవగానే ఉద్యోగులు ఇళ్లకు బయల్దేరి వెళుతుంటారు. కానీ, నగరపాలకంలో కొందరు అవినీతి ఉద్యోగుల దినచర్య ఇందుకు విభిన్నంగా ఉంటోంది. పొద్దువాలాకే వారి అసలు పని మొదలవుతుందని సమాచారం. దళారులతో ములాఖత్ కావటం, ఆ రోజుకు సంబంధించిన ముడుపుల లెక్కలు సరిచూకోవడం పరిపాటి అయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికీ గండిపడుతోంది. లంచం తీసుకుంటూ ఆర్.ఐ. శ్రీనివాసాచారి పట్టుబడటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.



**ఇప్పటివరకు ఆరుగురు..**

గతంలో కమిషనర్‌గా పనిచేసిన నజీం హైమద్, అకౌంటెంట్ ఓ కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. మరో ఘటనలో లంచం తీసుకుంటూ బిల్ కలెక్టర్‌గా నరేందర్ చిక్కాడు. ఎంబీ (మెజర్‌మెంట్ బుక్) రికార్డు చేసే విషయమై ఆమ్యామ్యాలు పుచ్చుకుంటూ మున్సిపల్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు దొరికాడు. గత సంవత్సరం ఆగస్టులో ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి ఇంట్లో సోదాలు జరపగా.. రూ.6 కోట్ల నగదు, పలు అక్రమాస్తులు బయటపడ్డాయి. తాజా ఘటనలో రెవెన్యూ విభాగంలో ఆర్ఐ రూ.7 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.

**ఉద్యోగం నుంచి తొలగిస్తున్నా మారరే**

గతంలో అనిశాకు చిక్కిన ఇద్దరు ఉద్యోగులను ఉద్యోగాల్లోంచి శాశ్వతంగా తొలగించారు. మరో ఉద్యోగి ఏసీబీకి చిక్కిన వెంటనే భవనంపై నుంచి దూకాడు. ఈ ఘటనలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఇంత జరుగుతున్నా కొందరు అవినీతి అధికారుల్లో మార్పు రావటం లేదు. ప్రస్తుతం అనిశాకు చిక్కిన రెవెన్యూ ఉద్యోగి గతంలోనూ ఇదే పనికి పాల్పడ్డాడు. అయినా తీరు మారలేదు. ఉద్యోగంలో తిరిగి చేరిన తర్వాతా లంచావతారం ఎత్తాడు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాలను ప్రక్షాళన చేయాలని, అవినీతికి తావులేకుండా పర్యవేక్షణ, నిఘా పెంచాలని నగరవాసులు కోరుతున్నారు.

'నగరపాలక సంస్థలో ఏ విభాగంలో డబ్బులు అడిగినా వెంటనే నా దృష్టికి తీసుకురండి. దీర్ఘకాలం తిష్ట వేసి అక్రమాలకు పాల్పడకుండా రెగ్యులర్, ఒప్పంద సిబ్బందిని సెక్షన్లు మార్చుతున్నాం. ఇంకా ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టాలో ఆలోచించి ఆచరణలో పెడతాం.'
దిలీప్‌కుమార్, నగరపాలక కమిషనర్

## రవాణాకు కష్టం.. ఆర్టీసీకి నష్టం

కామారెడ్డి : అసలే ఆదాయ వనరులు లేక చతికిలపడుతున్న ఆర్టీసీకి ఊహించని విధంగా వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కామారెడ్డిలో వరదల కారణంగా ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ఆర్టీసీ దాదాపు రూ.90 లక్షల ఆదాయం కోల్పోయింది. ఆగస్టు 27వ తేదీన తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో కామారెడ్డిలో పెద్దచెరువు కాల్వ పొంగి ఉద్ధృతంగా పారింది. తద్వారా జీఆర్ కాలనీ వద్ద పాత జాతీయరహదారి కోతకు గురైంది. హైదరాబాద్ వైపు వెళ్లే రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇది తీవ్ర ప్రభావం చూపింది.

**ప్రయాణానికి ఆటంకం**

నిజామాబాద్ వైపు వెళ్లే క్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరద నీరు జాతీయరహదారి పైకి రావడంతో కోత పడింది. దీంతో రోడ్డు ఓ వైపు ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సుల ప్రయాణానికి ఆటంకం కలిగింది. భిక్కనూరు మండలంలో ఎడ్లకట్ట వాగు పొంగి జాతీయరహదారిని ముంచెత్తడంతో అక్కడ కూడా ఇబ్బందులు తలెత్తాయి. నిజామాబాద్, హైదరాబాద్ మార్గాల్లో ఆగస్టు 30న మరమ్మతుల అనంతరం



రాకపోకలకు పునరుద్ధరించారు. బీబీపేట మార్గంలో వరద కారణంగా రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలు నిలిచాయి. మరో వైపు కరీంనగర్ మార్గంలో మూడు రోజుల పాటు ప్రయాణం సాగలేదు. పాల్వంచ వాగు ఉద్ధృతంగా పారడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచాయి. రోడ్ల మరమ్మతులు వేగవంతమైతేనే రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆర్టీసీ డీఎం కరుణశ్రీ న్యూస్‌టుడేకి వెల్లడించారు. వరదల కారణంగా ఆర్టీసీ ఆదాయం కోల్పోవడం బాధాకరమన్నారు.

**ఏయే మార్గాల్లో ఇబ్బందులంటే...**

కామారెడ్డి- నిజాంసాగర్ మార్గంలో బస్సులు నడవడం లేదు. జిల్లాకేంద్రం నుంచి కృష్ణాజివాడి, తాడ్వాయి, ఎర్రాపహాడ్ మీదుగా లింగంపేట వరకు మాత్రమే బస్సుల రాకపోకలు సాగుతున్నాయి.

లింగంపేట నుంచి ఎల్లారెడ్డి వెళ్లే మార్గంలో రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణానికి అనువుగా లేదు.

కామారెడ్డి నుంచి గుండారం, రామారెడ్డి మండలం గిద్దకు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# ఆకట్టుకునేలా.. అక్షరాస్యత పెంచేలా..

వికారాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య లేకపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపుతూ, అక్కడే కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. సర్కారు బడుల్లోనే పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని, క్షేత్రస్థాయిలో కసరత్తు ముమ్మరం చేసింది. తద్వారా బడుల్లో చిన్నారుల సంఖ్యను పెంచవచ్చని యోచిస్తోంది.

**మూడేళ్ల వయస్సు నుంచే..**

ప్రభుత్వం మూడేళ్ల వయసున్న పిల్లలకు ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తోంది. ఇప్పటికే జిల్లాలో పది పాఠశాలల్లో అమలు చేస్తోంది. చిన్నారులకు చదువుతోపాటు ఆటలు, వారి పోషణపై దృష్టి పెట్టేందుకు ప్రతి పాఠశాలకు ఆయా, బోధకురాలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు కనీస అర్హత ఇంటర్ లేదా సమానమైన అర్హత ఉన్న మహిళలు మాత్రమే అర్హులు. ఆయా పోస్టులకు కనీస అర్హత ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి. ఎంపికైన వారికి ఒక విద్యాసంవత్సరంలో 10నెలలకు మాత్రమే గౌరవ వేతనం అందించనున్నారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన బోధకురాలికి తప్పనిసరిగా శిక్షణ ఇవ్వనున్నారు.

**బోధకుల నియామకానికి..**

ఈ విద్యాసంవత్సరం నుంచే పూర్వ ప్రాథమిక పాఠశాలల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం జిల్లాలో 33 పాఠశాలలను మంజూరు చేసింది. వీటిల్లో వసతుల కల్పన, బోధకుల నియామకం చేపట్టనుంది. ఒక్కో పాఠశాలకు రూ. 1.5లక్షల చొప్పున ఇచ్చి, అవసరమైన సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రతి పాఠశాలలో ఫర్నిచర్‌కు రూ. 50వేలు, క్రీడల సామగ్రికి రూ. 50వేల చొప్పున ఖర్చు



చేయాల్సి ఉంటుంది. అదే విధంగా రూ.50 వేలతో పిల్లలను ఆకట్టుకునే విధంగా గదిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు.

**స్థానికులకే ప్రాధాన్యం..**

బోధకురాలు, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలని, వారి నివాస ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని డీఈఓ చెప్పారు. దరఖాస్తులను సెప్టెంబరు 1 నుంచి 9 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మండలాలు - 20
పంచాయతీలు - 594
ప్రాథమిక పాఠశాలలు - 774
ప్రాథమికోన్నత - 116
ఉన్నత పాఠశాలలు - 176
విద్యార్థులు - 90,650

**పర్యవేక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులదే**

ప్రీప్రైమరీ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడితో పాటు ఎంఈఓలదే. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి మరింత బలోపేతం చేసేదిశగా ప్రభుత్వం కృషిచేస్తోంది. పూర్వ ప్రాథమిక విద్య పూర్తయ్యాక ప్రభుత్వ బడుల్లోనే చదివేందుకు ఆస్కారముంది. అన్ని చోట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. రేణుకాదేవి, జిల్లా విద్యాధికారిణి

# అమ్మ ఒడే..తొలి బడి..!


నాంపల్లి : చిన్నారులు బడిలో చదువుకుంటున్నా.. తల్లిదండ్రుల ఒడిలో నేర్చుకునే అంశాలే వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోవడంలో కీలకపాత్ర పోషిస్తాయి. వారు బడుల్లో గురువుల కంటే తల్లిదండ్రుల వద్ద గడిపే సమయమే ఎక్కువ. ఈ నేపథ్యంలో పిల్లలను సమున్నత విలువలతో పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ప్రస్తుతం కొందరు విద్యార్థి దశలోనే నేర ప్రవృత్తి వైపు ఆకర్శితులవుతున్న క్రమంలో తల్లిదండ్రులు మరింత బాధ్యతగా వ్యవహరించాలి.

**పొదుపు పాఠాలు..**

ప్రస్తుతం ఎంత సంపాదించాం. అనే దానికంటే.. ఎంత పొదుపు చేశాం అన్నదే ముఖ్యం. చిన్నతనం నుంచే పిల్లల్లో పొదుపు పాఠాలు అలవర్చాలి. పొదుపు సూత్రాలు పాటిస్తూ క్రమబద్ధమైన విధానాన్ని ఆచరిస్తే భవిష్యత్తులో ఆర్థిక ఒడిదొడుకులు లేకుండా జీవితం సాఫీగా సాగుతుందన్న విషయాన్ని చెప్పాలి.

**ఆదర్శ జీవనం..**

పిల్లలు ఎక్కువగా కన్నవారినే అనుకరిస్తారు. మీ చిన్నారి ఉత్తమ విలువలతో జీవించాలని అనుకుంటే మొదట మీరు వారికి ఆదర్శంగా ఉండాలి. దీంతోపాటు ఆదర్శవంతంగా జీవించిన, సమాజంలో స్ఫూర్తిదాయక పాత్ర పోషించిన ప్రముఖుల జీవిత చరిత్రలను, వారి జీవన గమనంలోని ప్రధాన ఘట్టాలను విడమరచి చెప్పాలి.



**పుస్తక పఠనం వైపు..**

పిల్లల్లో పత్రికలు, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాలి. నిత్య జీవితంలో దాన్నో భాగం చేస్తూ నీతి కథలు, ఆదర్శ పురుషుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వాన్ని మెరుగు పరిచే పుస్తకాలను చదివించాలి. గురువులు, పెద్దలను గౌరవించాలని చెప్పాలి. వారు ఎక్కడ కలిసినా నమస్కరించి, మర్యాదపూర్వకంగా పలకరించాలని సూచించాలి.

సమయం కేటాయించాలి: బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి
తల్లిదండ్రులు రోజులో కొంత సమయాన్ని చిన్నారులకు కేటాయించాలి. మీ ప్రవర్తననే వారు భవిష్యత్తులో అనుకరిస్తారనే విషయం గుర్తించాలి. పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేలా విలువైన పాఠాలు బోధించాలి. నైతిక విలువలు నేర్పిస్తూ.. ఆదర్శవంతమైన మార్గాన్ని చూపాలి.

# అక్రమ రిజిస్ట్రేషన్లు.. ఖాళీ స్థలాలకు రెక్కలు



కుత్బుల్లాపూర్ : శివారుల్లో స్థిరాస్తి వ్యాపారం విస్తరిస్తోంది. ఎటుచూసినా బహుళ అంతస్తుల మేడలు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. దీంతో ఇళ్ల స్థలాల ధరలకు రెక్కలు వస్తుండటంతో అక్రమార్కుల కన్ను వాటిపై పడుతోంది. సబ్ రిజిస్ట్రార్లను మచ్చిక చేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్లకు తెరలేపుతున్నారు. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ అశోక్ సస్పెండ్ అయిన నేపథ్యంలో సంబంధిత కార్యాలయం వేదికగా జరిగిన కొన్ని అక్రమ రిజిస్ట్రేషన్లను పరిశీలిద్దాం.

**మచ్చుకు కొన్ని..**

కుత్బుల్లాపూర్ సర్కిల్ వెంకన్నహిల్స్‌కాలనీ లేఅవుట్‌లో 150 చదరపు గజాల స్థలాన్ని సామాజిక భవనం కోసం కేటాయించారు. 2003లో పురపాలిక సంఘం హయాంలో రూ.6 లక్షలతో గ్రౌండ్‌ఫ్లోర్‌తో సామాజిక భవనం నిర్మించారు. తిరిగి 2017లో రూ.18 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో రెండో ఫ్లోర్ నిర్మాణం పూర్తిచేశారు. 2024 నవంబరులో ఓ వ్యక్తి ఈ భవనం స్థలాన్నే ఖాళీ స్థలంగా చూపించి (తాజాగా సస్పెండైన సబ్‌రిజిస్ట్రార్ అశోక్‌తో) తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో స్థానికులు నివ్వెరపోయారు.

కొండాపూర్ శ్రీరాంనగర్‌కు చెందిన లగిశెట్టి జయశ్రీకి ప్రగతినగర్ వాసవి లేఅవుట్‌లో 244 చదరపు అడుగల స్థలం ఉంది. ఇటీవల ఆమె ఈసీ ద్వారా పరిశీలించగా స్థలం ఇతరులు కొనుగోలు చేసినట్లు గుర్తించి బాచుపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. విచారణలో బృందావన్‌హిల్స్‌లోని కమ్మరి కుమార్, తన అనుచరుడితో కలిసి బాధితురాలి పేరుతో విశాఖపట్నం అక్కయ్యపాలెంలోని టీఎస్ఎన్‌కాలనీలో ఉంటున్న మరో మహిళతో ఆ స్థలాన్ని సరాయి కృష్ణ అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలడంతో ఇరువురిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బౌరంపేటలోని సతీష్ సొసైటీలో సర్వసాయికుమారి 1984లో 1950 చదరపు గజాల స్థలం కొనుగోలు చేశారు. ఆనంతరం భర్తతో కలిసి బ్రెజిల్ వెళ్లిపోగా అక్కడ రోడ్డు ప్రమాదంలో వారు చనిపోయారు. నానక్‌రామ్‌గూడలో ఉంటున్న ఆమె కుమారుడు కిరణ్‌బాబు తరచూ ఆ స్థలాన్ని చూసి వెళ్తుండేవారు. 2024 ఆగస్టు 10న అతను ఆ స్థలం వద్దకు వెళ్లగా అందులో రెండు రేకుల షెడ్లు వేయడాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. సబ్‌రిజిస్రార్ కార్యాలయానికి వెళ్లి ధ్రువపత్రాలు పరిశీలించుకోగా తమ స్థలం శేఖర్‌బాబు అనే వ్యక్తిపేరున రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# పెసర.. ఏదీ ఆసరా!



తాండూరు: జిల్లాలో భారీగా కురిసిన వర్షాలు పెసర పంటను తీవ్రంగా దెబ్బతీశాయి. ఒక్కో ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళు రావాల్సినవి చాలా తక్కువ వచ్చాయి. లోతట్టు భూముల్లో అర క్వింటాయే చేతికి అందాయి. ఉత్పత్తులను విపణులకు తీసుకెళితే వ్యాపారులు నాణ్యత లేదని పేర్కొంటూ తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

**వర్షాలు కురవడంతో..**

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 9,579 ఎకరాల్లో పెసర సాగు చేశారు. పంట చేతికి అందే ఆగస్టులో భారీ వర్షాలు కురవడంతో కాయలు మెత్తబడి పోయాయి. గింజలు రంగు మారాయి. తాండూరు విపణికి విక్రయానికి వస్తున్న పెసరకు మద్దతు ధర లభించడం లేదు. గింజలు నాణ్యంగా లేకపోవడమే కారణమని అధికారులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

**పెట్టుబడి పోయినట్లే..:** ఎకరా పెసర సాగుకు రూ.8వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. ఈ లెక్కన జిల్లా మొత్తంగా రైతులు రూ.7.66 కోట్ల పెట్టుబడి పెట్టారు. ఇందులో సగం కూడా చేతికి అందకపోవడంతో రైతులు నష్టపోయారు.

**కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి..:** మద్దతు ధర కంటే తక్కువ లభిస్తున్నపుడు ప్రభుత్వం గతంలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్‌లో ఒక్కో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమయంలో కేంద్రం ప్రకటించిన మద్దతు ధర చెల్లించారు. ప్రస్తుతం తక్కువ ధర లభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

**లభించింది ఇలా..**

ఆగస్టు 12 నుంచి విక్రయాలు 153 క్వింటాళ్లతో ప్రారంభమయ్యాయి. క్వింటాకు గరిష్ఠ ధర రూ.7,077, కనిష్ఠ ధర రూ.6,500, సగటు ధర రూ.6,977 లభించింది. ఆగస్టు 28న 1,623 క్వింటాళ్లు వచ్చాయి. గరిష్ఠ ధర రూ.7,457 లభించింది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం. కనిష్ఠ ధర రూ.5,004 లభించింది. బుధవారం 392 క్వింటాళ్ల ఉత్పత్తులు విక్రయానికి తీసుకు వచ్చారు. ఒక్కో క్వింటాకు గరిష్ఠ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.3,501, సగటు ధర రూ.6,363 లభించింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.8,682 ధర లభించ లేదు. విపణిలో ఇప్పటి వరకు 3,722 క్వింటాళ్లు కొనుగోలు చేశారు.

# 'పుట్టు'.. ఆపై లంచం కట్టు



హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే.. రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు సమర్పించుకోవాలి. కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే తల్లిదండ్రులకు మరో తలనొప్పి ఎదురవుతోంది. వివరాలను వైద్య సిబ్బంది తప్పుగా నమోదు చేస్తున్నారు. ఒక్కోసారి తల్లిదండ్రుల పేర్లకు బదులు.. అవ్వాతాతల పేర్లు నమోదు చేస్తున్నారు.

**ఇవిగో ఉదాహరణలు..**

గాంధీ ఆస్పత్రిలో పుట్టిన శిశువుకు ధ్రువీకరణపత్రం తీసుకునేందుకు తల్లిదండ్రులు ఈ ఏడాది జూన్ 23న దరఖాస్తు (సీఎన్ఐ 022502380770) చేసుకున్నారు. ఇంకా ఆమోదం పొందలేదు. బల్దియా రికార్డుల్లో తండ్రి పేరు నరసింహులుకు బదులు నరసిమ్‌లు అని ముద్రించారు. ఇంటి పేరు చేర్చలేదు.

మే 29, 2025న చిన్నారికి పేరు నమోదుకు తల్లిదండ్రులు చేసుకున్న దరఖాస్తును (సీఎన్ఐ 022502359540) దాదాపు మూడున్నర నెలలపాటు తొక్కిపెట్టారు.

పేట్లబురుజు ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించిన శిశువుకు జనన ధ్రువీకరణపత్రం ఇవ్వాలంటూ నెల కిందట దరఖాస్తు (సీఎన్ఐ 022502420640) చేసుకున్నారు. ఆస్పత్రిలో తల్లిదండ్రుల పేర్లను ఇంటి పేరు లేకుండా రికార్డుల్లోకి ఎక్కించారు. మరోసారి సవరణకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

సొమ్ము చేసుకొనేందుకే తప్పులు

గాంధీ, కోఠిలోని ప్రసూతి, పేట్లబురుజు ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో కాన్పులకు వచ్చే వారిలో 90 శాతం రికార్డుల్లో తప్పుగా నమోదవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా తప్పిదాలు సృష్టిస్తూ సవరణకు సొమ్ము చేసుకోవడమే వారి ఉద్దేశమని బాధితులు వాపోతున్నారు.

**నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..**

పేరు నమోదు, సవరణ దరఖాస్తులు రెండు వారాల్లో ఆమోదం పొందాలి. జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం నెలలపాటు తొక్కిపెడుతున్నారు. సిబ్బందిని సంప్రదించి.. లంచం ముట్టజెప్పే వరకు ఆమోదం రావడం లేదు.

# పురంలో.. నడిచేదెలా..!

సూర్యాపేట : పట్టణ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డ, పాతబస్టాండ్, తపాలా కార్యాలయం రోడ్డు, పూలసెంటర్, పీఎస్ఆర్ సెంటర్‌లో రహదారులకు ఇరువైపులా మురుగు కాల్వలపై ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. వీటిపై టీస్టాల్, మెకానిక్ షెడ్లు, పండ్ల వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో తాము రోడ్లపై ప్రమాదకరంగా నడిచి వెళుతున్నామని పాదచారులు వాపోతున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేస్తామని పుర కమిషనర్ హన్మంతరెడ్డి తెలిపారు. నేరేడుచర్లలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తుండటంతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలను ఆక్రమించి వ్యాపార కేంద్రాలుగా మార్చారు. పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో తారు రోడ్లపైనే వ్యాపార నిర్వహణ చేపడుతున్నారు.

**నడక గగనం**

తిరుమలగిరి పురపాలికలో నడకదారిపై వ్యాపారులు తమ సామగ్రిని నిల్వచేయడంతో నడవలేని దుస్థితి నెలకొంది. స్థానిక తెలంగాణ



చౌరస్తాకు నాలుగువైపులా ఉన్న మార్గాల్లో రోడ్ల వెడల్పు పనులు చేపట్టిన తర్వాత నడకదారి ఏర్పాటు చేశారు. కాగా నడకదారిని ఖాళీగా ఉంచకుండా వాటిపై సామాన్లు పెడుతున్నారు. తొర్రూరు మార్గంలో సర్వీసు రోడ్డుపై ఆటోలు నిలిపి ఉంచడంతో రోడ్డుపై నడిచే వారికి ఇబ్బంది కలుగుతోంది. సూర్యాపేట, జనగామ మార్గంలో కొందరు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి మెట్లు నిర్మించుకున్నారు. దుకాణల ముందు పార్కింగ్ స్థలాలు లేక వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలను రోడ్లపై నిలుపుతున్నారు. దీంతో పోలీసులు ఆయా వాహనాలకు జరిమానా విధిస్తున్నారు.

***రోడ్లపైనే నడక..***

పట్టణంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించడంతో ప్రయాణికులు రహదారులపైనే నడవాల్సిన దుస్థితి నెలకొంది. హుజూర్‌నగర్ ప్రధాన రహదారిని విస్తరించిన సమయంలో ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెంట ఫుట్‌పాత్‌పై పురపాలక సంఘం ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు షెడ్లు నిర్మించారు. వీటిని చూసి చిరు వ్యాపారులు ఇతర ప్రాంతాల్లో ఆక్రమణలకు తెరలేపారు. పెద్ద దుకాణల ఎదుట నడకదారిని ఆక్రమించి సామగ్రిని ఉంచుతున్నారు. రోడ్లపై నడిచి ప్రమాదాలకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నామని, త్వరలో ఖాళీ చేయిస్తామని పుర అధికారులు చెబుతున్నారు.

# ఈసారి ముందస్తుగా సన్నద్ధత

నేలకొండపల్లి : విద్యార్థుల భవితకు తొలిమెట్టు పదో తరగతి. ఇందులో మంచి మార్కులు సాధిస్తే ఎన్నో అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సెప్టెంబరు 1 నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించారు. ఏటా జనవరి నెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించటంతో పది ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు వెనకబడుతున్నారు. ఈ విషయం గమనించిన రాష్ట్ర పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సెప్టెంబరు నెల నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో సోమవారం నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.

**ఉదయం, సాయంత్రం నిర్వహణ**

రోజువారీగా ఉదయం 8 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ఏ రోజు ఏ సబ్జెక్టు చదవించాలో షెడ్యూల్ విడుదల చేశారు. వారంలో సోమవారం ఉదయం సాంఘికశాస్త్రం, సాయంత్రం తెలుగు, మంగళవారం ఉదయం తెలుగు, సాయంత్రం హిందీ, బుధవారం ఉదయం బయాలజీ, సాయంత్రం ఇంగ్లిష్, గురువారం ఉదయం ఇంగ్లిష్, సాయంత్రం గణితం, శుక్రవారం ఉదయం మ్యాథ్స్, సాయంత్రం ఫిజికల్ సైన్స్, శనివారం ఉదయం ఫిజికల్ సైన్స్, సాయంత్రం సోషల్ స్టడీస్ చదివించాలి. సందేహాల నివృత్తికి ఆయా సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి.

**వచ్చే నెల 10లోపు..**

పదో తరగతి సిలబస్ అక్టోబరులో 10వ తేదీలోపు పూర్తి చేయాలి.



ఈ క్రమంలో తరగతుల నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రివిజన్ తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలి. ప్రత్యేక తరగతులకు వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి. ప్రత్యేక తరగతులను తరగతి గదిలో మాత్రమే నిర్వహించాలి. గ్రీన్‌బోర్డులతో పాటు డిజిటల్ బోర్డులను ఉపయోగించాలి. బృంద చర్చలు చేసుకొనే వెసులుబాటు కల్పించాలి.

ఉన్నత పాఠశాలలు
ఖమ్మం: 227
భద్రాద్రి: 124
విద్యార్థులు
ఖమ్మం: 1,231
భద్రాద్రి: 9,702

జిల్లాల వారీగా పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంఈఓలతో పాటు ఆయా ప్రధానోపాధ్యాయులకు సమాచారాన్ని అందించాం. వంద శాతం ఫలితాల కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా శ్రమిస్తాం. అల్పాహారం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బి.నాగలక్ష్మి, డీఈఓ, భద్రాద్రి

# ఆలయాలు పల్లెల్లో.. కార్యాలయం నగరంలో..

వికారాబాద్ : జిల్లాలో సుమారు 200 వరకు చిన్న, పెద్ద ఆలయాలున్నాయి. వాటి బాగోగులు చూసి సమస్యలను పరిష్కరించే జిల్లా అధికారి కార్యాలయం మాత్రం హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో ఉంది. దీంతో భక్తులు, కొందరు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. భూములకు సంబంధించిన సమాచారమంతా ఆన్‌లైన్ చేశారు. దీంతో చాలామంది అన్నదాతల పట్టా భూములు 'ఎండోమెంట్ ల్యాండ్' అని చూపుతోంది. దీంతో సమస్య పరిష్కారానికి హైదరాబాద్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది.

**వేధిస్తున్న సమస్యలు..**

జిల్లాలోని చాలా ఆలయాల్లో సమస్యలున్నాయి. కొన్నింట్లో ధూపదీప నైవేద్యాలే లేవు. వికారాబాద్ పట్టణానికి 6 కి.మీ. దూరంలోని శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయముంది. ఏటా పెద్ద జాతర జరుగుతుంది. ఈ ఆలయాన్ని రాష్ట్రస్థాయి ప్రముఖులు దర్శించుకుంటారు. ఆలయం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2020లో శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదు. చుట్టుపక్కల ఖాళీ స్థలమున్నా శౌచాలయాలు మాత్రం లేవు. దీంతో మహిళా భక్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోమిన్‌పేట మండలం దుర్గంచర్వులో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం ఉంది. దీనికి ఆనుకొని ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. రహదారి చిన్నగా ఉండటంతో



వాహనాలు ఎదురెదురుగా వస్తే గుట్టపైకి వెళ్లలేకపోతున్నాయి. రోడ్డు మధ్యమధ్యలో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ ఆలయానికి సరైన నీటి సౌకర్యం లేదు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి కార్యాలయం అందుబాటులో ఉండాలని పలువురు కోరుతున్నారు.

**150 కి.మీ.దూరం..**

జిల్లాలోని దౌల్తాబాద్, కొడంగల్, బషీరాబాద్ మండలాల వాసులు హైదరాబాద్ వెళ్లాలంటే 150-200 కి.మీ. దూరం ప్రయాణించాల్సిందే. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ అధికారి కార్యాలయం లేదు. ఆలయాల ద్వారా ప్రభుత్వానికి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా వసతులు కల్పించడం లేదు, అధికారులను నియమించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనే కార్యాలయం ఏర్పాటు చేస్తే ఆలయాలు అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని పలువురు అంటున్నారు. జిల్లాలో ఈఓల కొరత వేధిస్తోంది. ప్రతి ఆలయానికి అధికారి ఉండాలి. కనీసం పెద్ద వాటికైనా నియమించాలి. జిల్లాలో ఒక్కో ఈఓ 10- 20 ఆలయాలను పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాలు, టెండర్లు, కౌలు భూముల పర్యవేక్షణ తదితర పనులతో వారికి పని ఒత్తిడి పెరిగింది.

# కొత్తవి నిర్మించరు.. మరమ్మతులైనా చేపట్టరు

నిజామాబాద్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్నపాటి జ్వరాలకు బాధితులు స్థానిక ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు. చాలాచోట్ల దవాఖానాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అక్కడకు చికిత్స రావాలంటేనే రోగులు జంకుతున్నారు. మరమ్మతులకు అంచనాలు రూపొందించినా నిధులు విడుదల కాకపోవడం, మరోవైపు పనులన్నీ పూర్తయినా కొత్త భవనాలను ప్రారంభించడంలో ఏళ్ల తరబడి జాప్యం కొనసాగుతోంది. జిల్లాలో 27 పీహెచ్‌సీలు ఉన్నాయి. అర్సపల్లి, స్మీఎస్ కాలనీ, దుబ్బ, గౌతమ్‌నగర్, మాలపల్లి, ఎస్ఆర్‌నగర్, వినాయక్‌నగర్, పంగపల్లి, రాకాసిపేట అర్బన్ పీహెచ్‌సీలకు మరమ్మతులు అవసరమని అధికారులు అంచనాలు రూపొందించి ఏళ్లు గడుస్తున్నాయి. సాలూర పీహెచ్‌సీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా.. కొత్త భవన నిర్మాణం వెంటనే చేపట్టాల్సి ఉంది. వీటన్నింటినీ బాగు చేయడానికి రూ.5.37 కోట్లు కావాలని అధికారులు చెబుతున్నారు.

**వీటికి మోక్షం ఇంకెన్నడో...**

కొత్తపల్లి, కుర్నపల్లి, రామన్నపేట్, పాచెల్‌నడికుడలో ఆరోగ్య ఉపకేంద్రాల భవనాల నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. చందూర్, ఆలూర్, ముప్కాల్, చిమాన్‌పల్లి పీహెచ్‌సీల కొత్త



నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పీహెచ్‌సీలలో 83 మంది వైద్యులు అవసరం. ఇతర సిబ్బంది కొరత కూడా ఉంది. జీజీహెచ్‌తో పాటు, పీహెచ్‌సీలలోని వైద్యులు ప్రైవేటు ప్రాక్టీసు నిర్వహిస్తూ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి.

**జీజీహెచ్‌కి ఏమిటీ గోస...**

జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో చిన్నపాటి వర్షానికే కొన్ని గదుల్లో నీళ్లు చేరుతున్నాయి. ఎప్పుడు పెచ్చులూడి పడతాయో అని రోగులు బిక్కుబిక్కుమంటున్నారు. రూ.40 కోట్ల వ్యయంతో మాతా, శిశు సంరక్షణ కేంద్రం, అత్యవసర భవనాలను నిర్మించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఏడాది క్రితం ప్రారంభం సైతం చేశారు. లిఫ్టులు లేవనే సాకుతో నేటికీ జీజీహెచ్ నుంచి మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి ప్రసూతి, క్రిటికల్ కేర్ సేవలను తరలించలేదు. రూ.కోట్లు వెచ్చించి పూర్తిచేసిన భవనం ఏడాది నుంచి వృథాగా ఉంటోంది. అసౌకర్యాల మధ్య నెలకు 650 వరకు ప్రసవాలు చేయాల్సి వస్తున్నందున.. లిఫ్టులను ఏర్పాటును చేసి వెంటనే నూతన భవనంలోకి ప్రసూతి విభాగాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నెల 15వ తేదీలోగా పనులు పూర్తవుతాయని ప్రకటించిన అధికారులు.. సకాలంలో ఎంసీహెచ్‌ను ప్రారంభించేలా చూడాలి.

# నీటి వనరుల్లోకే నిర్మాణ వ్యర్థాలు



సిరిసిల్ల : జిల్లాలో గృహ నిర్మాణాల కూల్చివేత, రహదారుల తవ్వకాలతో వచ్చే వ్యర్థాల నిర్వహణ సరిగ్గా లేదు. వ్యర్థాలను వాగులు, చెరువులు, కుంటలు, కాల్వలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నింపుతుండటంతో జలవనరులు వాటి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. అధికారులు సకాలంలో వ్యర్థాలను తొలగించటంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. బండరాళ్లు, ఇటుకలు మురుగునీటి కాల్వల్లోకి చేరి వరద, మురుగు ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రహదారులు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి.

**వందల టన్నులు కుమ్మరింపు**

పురపాలికల్లో నిర్మాణ ఘన వ్యర్థాల తరలింపులో సరైన పర్యవేక్షణ లేదు. జిల్లాలోని రెండు పురపాలికల్లో నిత్యం వందల టన్నుల నిర్మాణ వ్యర్థాలు వెలువడుతున్నాయి. వీటిని కొంత మేరకు డంప్‌యార్డులకు తరలిస్తుండగా.. ఎక్కువ మొత్తం సమీపంలోని ఖాళీ స్థలాలు, వాగులు, చెరువు శిఖాల్లో కుమ్మరిస్తున్నారు. నీటి వనరులను స్థిరాస్తిగా మార్చుతూ.. దీంతో అవి క్రమంగా అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల శివారుల్లోనే ఈ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయం నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు రోడ్డువిస్తరణలో భాగంగా రహదారికి ఇరువైపులా కట్టడాలు తొలగించారు. ఇప్పుడా వ్యర్థాలు పేరుకుపోయి పట్టణవాసులు, భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. పురపాలక శాఖ వ్యర్థాల తొలగింపునకు రూ.23లక్షలతో టెండర్లు పిలిచింది. ఈనెల 11న తెరవనున్నారు.

**ప్రతిపాదన మూలకు..**

ఇసుక, ఇటుక, కంకరను నూర్పిడి చేసి పునర్వినియోగ వస్తువుగా మార్చే కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషింగ్ (సీఎండీ) ప్లాంటు జిల్లాలో అందుబాటులో లేదు. గతంలో సిరిసిల్ల పురపాలికలో ఏర్పాటు చేసేందుకు ప్రైవేటు సంస్థతో ఒప్పందం జరిగింది. అప్పుడు పట్టణంలోని మానేరువాగు సమీపంలో ప్లాంటు కోసం ప్రత్యేకంగా స్థలం కూడా కేటాయించారు. నిధుల కేటాయింపులో జాప్యం జరగడంతో ఈ ప్రతిపాదన మూలకు చేరింది. జిల్లాలో సీఎండీ ప్లాంటు ఏర్పాటు చేస్తే నిత్యం వేల టన్నుల నిర్మాణ వ్యర్థాల మట్టి, కంకర, ఇసుక మార్చే అవకాశం ఉంటుంది. యంత్రాల సామర్థ్యాన్ని బట్టి గంటకు 20 నుంచి 100 టన్నుల వరకు పొడిగా మార్చవచ్చు. వ్యర్థాలతో ఇటుక, నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని తిరిగి తయారు చేసుకోవచ్చు.

# ఆదివాసీ ఆహారం.. ప్రకృతి ప్రసాదం!



భద్రాచలం ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి అనే పాట భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీల ఆహార, పానీయాలకు చక్కగా సరిపోతుంది. ఏయ్ చాయ్ చటుక్కున తాగరా భాయ్.. ఈ చాయ్ చమక్కులే చూడరా భాయ్ అనే పాటను జ్ఞప్తికి తెస్తుంది అడవిబిడ్డలు తయారుచేస్తున్న విప్ప పువ్వు టీ. సేంద్రియ పద్ధతిలో పండించిన తృణధాన్యాలతో పాటు అడవుల నుంచి సహజసిద్ధంగా లభించే వాటిని తాము తినటమే కాకుండా అందరికీ అందించాలనే ఉద్దేశంతో అడవిబిడ్డలు మార్కెటింగ్ చేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను చూడచక్కని బ్రాండ్లు, లేబుళ్లు, ప్యాకింగ్‌తో తయారుచేస్తూ వ్యాపారంలో ముందడుగు వేసేందుకు సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రోత్సాహమందిస్తున్నారు.

**జీసీసీ ఉత్పత్తులకు ఆదరణ..**

గిరిజన సహకార సంస్థ ఉత్పత్తులకూ ఆదరణ ఉంటోంది. కుంకుడుకాయలను సబ్బులతో పాటు షాంపూల తయారీకి వినియోగిస్తారు. చింత పిక్కలను వస్త్రాలకు పెట్టే గంజి తయారీకి ఉపయోగిస్తుంటారు. విప్ప పలుకును సబ్బుల తయారీకి, కరక్కాయలు, ముష్టిగింజలను ఆయుర్వేద ఔషధాల తయారీకి వాడతారు. తేనె వల్ల రక్తశుద్ధి, చర్మ సౌందర్యం వస్తుంది. ఉసిరిపప్పుతో మధుమేహం తగ్గుతుంది. ఇలా ప్రకృతిలో దొరికేవి ఔషధ గుణాలు కలిగి ఉంటాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా మనిషికి ఇవి అవసరమని జీసీసీ డీఎం సమ్మయ్య, మేనేజర్ జయరాజు వివరించారు.

**ఆహా.. విప్ప టీ..**

చర్ల మండలానికి చెందిన ఆదివాసీ మహిళలు సొంతంగా శిక్షణ పొంది విప్ప పువ్వు లడ్డూలు తయారుచేశారు. వీటికి ఆదరణ లభిస్తుండటంతో విప్ప పువ్వుతో బర్ఫీలు సిద్ధం చేశారు. చిన్నారులు నచ్చే విధంగా దాదాపు పది గ్రాముల బరువు గల చాక్లెట్లనూ అందుబాటులోకి తెచ్చారు. విప్ప పువ్వును బాగా ఆరబెట్టి.. అందులో మట్టి లేకుండా జాగ్రత్తలు పాటించి విప్ప పూల టీ ప్యాకెట్లను సరికొత్తగా మార్కెటింగ్ చేస్తున్నారు. 250 గ్రాముల బరువు గల ఈ ప్యాకెట్ ధర రూ.95. ఒక్క స్పూన్ విప్ప పువ్వును తగిన మోతాదు వేడినీటిలో కలిపి కప్పు టీ తాగితే నూతనోత్తేజం వస్తుందని ఆదివాసీ మగువలు చెబుతున్నారు. విప్ప పువ్వు ఉత్పత్తులన్నీ సహజసిద్ధమైనవి. పోషక విలువలు గల ఆహారం ఇది. గర్భిణులు, బాలింతలు వాడొచ్చు.

సామలు, కొర్రలు, రాగులు, జొన్నలతో తయారుచేసిన బిస్కెట్లను భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ పేరిట విక్రయిస్తున్నాం. వీటి గురించి తెలుసుకున్న ప్రధాని మోదీ అభినందించారు. ఇదే ఉత్సాహంతో తాజాగా వోట్స్, ఊదలు, అండు కొర్రలు, అవిసెలతో బిస్కెట్లు తయారుచేస్తున్నాం. శారీరకంగా ఇవి బలాన్ని అందిస్తాయి. రోగనిరోధకశక్తిని పెంచుతాయి.

లలిత, బిస్కెట్ల తయారీదారు

# కేసుల నమోదుపై ప్రైవేటు ఏజెన్సీ ఆరా!



వికారాబాద్ :గత నెల 5న వికారాబాద్ ఠాణాలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. ఈ విషయమై కాల్ సెంటర్ నుంచి ఓ యువతి ఇరువర్గాల వారికి ఫోన్ చేసి.. పోలీసుల ప్రవర్తనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డబ్బులేమైనా డిమాండ్ చేశారా.. అని ఆరా తీశారు. మరో కేసులోనూ బాధితుడికి ఫోన్ చేసి.. పోలీసుల పనితీరు సంతృప్తికరంగా ఉందా.. మీతో ప్రవర్తించిన తీరు ఎలా ఉందన్న వివరాలు అడిగారు. ఠాణాకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో పోలీసులు గౌరవంగా వ్యవహరించేలా ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేస్తున్నా చాలాచోట్ల అది అమలు కావడం లేదు. ఠాణాకు వెళ్లిన సాధారణ వ్యక్తులకు సముచిత గౌరవం దక్కడం లేదు. తాగునీరు అందించి కూర్చోమనడం దేవుడెరుగు.. కసురు కోవడంతోపాటు ఫిర్యాదుదారుల సమస్యలను సరిగా వినడం లేదన్న విమర్శలున్నాయి. గొడవలకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి వెళితే కనీసం సమస్య వినడానికీ ఆసక్తి కనబర్చడం లేదని పలువురు చెబుతున్నారు. ఫిర్యాదు రాసివ్వండి.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. పలుకుబడి కలిగిన వ్యక్తులు, రాజకీయ నాయకులు చెప్పిన పనికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అభిప్రాయ సేకరణకు..**

ఫిర్యాదుదారుల నుంచి అభిప్రాయ సేకరణ విషయంలో పక్కాగా వ్యవహరిస్తున్నారు. వివరాల సేకరణ బాధ్యతలను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. దీనికి పోలీసు శాఖతో ఎలాంటి సంబంధాలుండవు. రోజూ వీరు ఠాణాలవారీగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను సేకరిస్తారు. ఫిర్యాదుదారుడి చరవాణి సంఖ్యకు ఫోన్ చేసి మాట్లాడతారు. ఈ ఫోన్ సంభాషణ అంతా నమోదవుతుంది. వివరాలను హైదరాబాద్‌లోని ప్రధాన నియంత్రణ కేంద్రానికి ఎప్పటికప్పుడు చేరవేస్తున్నారు. ఠాణాలో ఫిర్యాదు నమోదైన వెంటనే సంబంధిత వివరాలన్నీ అంతర్జాలంలో ఫీడ్‌బ్యాక్ కేంద్రానికి చేరవేస్తారు. అక్కడి ప్రైవేటు సిబ్బంది వీటిని పరిశీలించాక సంబంధిత ఫిర్యాదుదారుడితోపాటు అవసరమైతే బాధితుడితోనూ మాట్లాడుతున్నారు. **మర్యాదలో తేడా వస్తే ఊరుకునేది లేదు..** ఠాణాల్లో ఇదివరకటి పరిస్థితి లేదు. ఎంతో మార్పు వచ్చింది. పరుష పదజాలంతో దూషించడం, దండించడం లాంటివి లేవు. ప్రజలతో మమేకమై పనిచేయాలని, ఠాణాలకు ఎవరొచ్చినా పేద, ధనిక తేడా చూపకుండా మర్యాదగా మసులుకోవాలని పోలీసులకు తరచూ చెబుతున్నాం. మర్యాదలో తేడా వస్తే ఊరుకునేది లేదు.

నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి


# అనుబంధం వద్దు.. పంచాయతీలే ముద్దు

కామారెడ్డి : జిల్లాలో ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయాలని కొన్ని అనుబంధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం గత ప్రభుత్వం జిల్లాలో 208 గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను సైతం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీల సంఖ్య 532కి చేరింది. ఇది వరకు కొత్త పంచాయతీలు ఏర్పాటైన నేపథ్యంలో మరిన్ని పంచాయతీల డిమాండు ఊపందుకుంది. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని కొత్త పంచాయతీల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..** నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ నుంచి ఎర్రారంను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది.

ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని లేదా పాత పంచాయతీలో విలీనం చేయాలని తండావాసులు ఇదివరకే ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అడివిలింగాల తండాను కొత్తగా ఆవిర్భవించిన కొక్కొండ పంచాయతీలో విలీనం చేశారు.

భిక్కనూరు మండలం లక్ష్మీనగర్‌తండా జంగంపల్లి పంచాయతీలో ఉ



ంది. ఈ రెండు గ్రామాల మధ్య దూరం మూడు కి.మీలు కావడంతో ప్రత్యేక పంచాయతీ డిమాండ్ నెలకొంది.

మద్నూర్ మండలంలో సలాబత్‌పూర్ ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రజల్లో ఉంది. ఇది చిన్నశక్కర్గ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉంది.

బీబీపేట పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న రాంరెడ్డిపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**ఈ పరిస్థితి ఎందుకంటే..**

కొత్త పంచాయతీల డిమాండ్లు జిల్లాలో అక్కడక్కడ వినిపిస్తున్నాయి. కొందరు జిల్లా పంచాయతీ అధికారులను కలిసి చాలాసార్లు వినతిపత్రాలు అందజేశారు. మరికొందరు వారి ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. ఈ ప్రత్యేక పంచాయతీల డిమాండ్లకు వివిధ రకాల కారణాలు ఉన్నాయి. చిన్నగ్రామాలు, రెండు మూడు తండాలను కలిపి ఒకే పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ రెండు మూడు తండాలు, గ్రామాల మధ్య దూరం రెండు మూడు కి.మీ దూరం ఉంటుంది. దీంతో ప్రతి పనికి పంచాయతీ ఉన్న గ్రామానికి లేదా తండాకు వెళ్లాల్సి వస్తోందని కారణం చెబుతున్నారు. మరొక ముఖ్య కారణం నిధుల పంపకాల్లో తేడాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ ఉన్న గ్రామానికి లేదా తండాకు మాత్రమే ఎక్కువ నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేసుకుంటున్నారని అనుబంధ గ్రామాల ప్రజల వాదనగా ఉంది. పంచాయతీ ఉన్న గ్రామాల వారికే పదవులు వరించే అవకాశం ఉండడంతో అనుబంధ గ్రామాల వారు అసంతృప్తిగా ఉంటున్నారు.

# హరితం పెంచండి.. ఆదాయం పొందండి

కామారెడ్డి : పర్యావరణ పరిరక్షణ కోసం సర్కారు వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో మొక్కలు నాటుతుంది. అంతకు ముందు హరితహారం పేరుతో మొక్కలు నాటించారు. గతంలో నాటిన మొక్కలు ఇప్పుడు బతికి ఉంటే అవి ఆదాయ వనరులుగా మారనున్నాయి. ప్రభుత్వం తాజాగా కార్బన్ క్రెడిట్ పేరుతో కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. దీనిని తెలంగాణ సౌభాగ్యం అని కూడా పిలుస్తున్నారు. ఈ పథకంలో గత మూడేళ్లలో నాటిన మొక్కలు బతికి ఉంటే అవి విడుదల చేసే ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి యజమానులకు డబ్బులు అందనున్నాయి. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాల్లో నాటిన మొక్కలను లెక్కించడానికి త్వరలో సర్వే చేపట్టనున్నారు.

**ప్రభుత్వంతో ఒప్పందం**

ప్రభుత్వం దిల్లీలోని పర్యావరణ సంస్థ ఐఓఆర్ఏతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పెరిగిన మొక్కలను పరిశీలన చేసి యజమానులకు డబ్బులు చెల్లించడమే దీని ముఖ్య ఉద్దేశం. జిల్లాలో మూడేళ్లలో సుమారు 70 లక్షల వరకు మొక్కలు నాటారు. ఎన్ఐసీ పోర్టల్‌లో నుంచి నాటిన మొక్కల వివరాలను ఆయా మండలాలకు పంపిస్తున్నారు. సాంకేతిక సహాయకులు చరవాణుల్లో ప్రత్యేక యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. వీరు సర్వే చేసే సమయంలో బతికి ఉన్న మొక్కల ఫొటోలు తీసుకుంటారు. ఉపాధిహామీలో వ్యక్తిగతంగా మొక్కలు పెంచితే యజమాని ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాపాస్ పుస్తకాల వివరాలను తీసుకుంటారు. సర్వే పూర్తయిన తర్వాత ఐఓఆర్ఏ సంస్థ వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారణ చేసుకుంటారు.

**చెల్లింపులు ఇలా..**

సర్వే పూర్తయిన తర్వాత నాటిన మొక్కలు ఏ స్థాయిలో ఉన్నాయి.. అవి ఎంత ఆక్సిజన్‌ను విడుదల చేస్తున్నాయనే విషయాలను సంస్థ వారు లెక్కగడుతారు. ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి లెక్కలు ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలో ఇదే అంశంపై కొన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. చాలా మంది రైతులు తమ మొక్కలను ఇతర కంపెనీ వారు కొనుగోలు చేసినట్లా అని ప్రశ్నిస్తున్నారు. అలా కాదని కేవలం ఆక్సిజన్ పరిమాణం ఆధారంగా రైతులకు డబ్బులు చెల్లిస్తారని అధికారులు సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో నాటిన మొక్కలపై పంచాయతీకి డబ్బులు చెల్లిస్తారు. ఈ విషయమై డీఆర్‌డీవో సురేందర్ మాట్లాడుతూ.. కార్బన్ క్రెడిట్ పేరుతో పెరిగిన మొక్కలకు కొన్ని డబ్బులు చెల్లించాలనేది ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం గ్రామసభలు నిర్వహిస్తున్నాం. తర్వాత వివరాలను రాష్ట్రానికి పంపిస్తాం. పర్యావరణాన్ని సంరక్షించడానికి ఎవరైతే మొక్కలు నాటి పోషిస్తారో వారికి కొంత పారితోషికం అందుతుందని తెలిపారు.





# వైసీపీ కంచుకోటని మంచుకోటని చేసే పనిలో బాబు !

వైసీపీకి అండగా నిలిచిన ప్రాంతం రాయలసీమ. అలాగే ఒక బలమైన సామాజిక వర్గం. జగన్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ నుంచి వేరు పడి సొంత పార్టీ పెట్టాక ఆయన వెన్నంటి ఉన్నది రాయలసీమ ప్రాంతం. అలాగే బలమైన సామాజిక వర్గం. అందుకే 2014లో వైసీపీ ఓటమి పాలు అయినా 67 అసెంబ్లీ సీట్లు సాధించి బలమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలో నిలిచింది.

ఇక 2019లోనూ రాయలసీమ మొత్తం జగన్ వైపు ఉండి వైసీపీ చెయ్యెత్తి జై కొట్టింది. ఫలితంగా మొత్తం రాయలసీమలోని నాలుగు జిల్లాలలో ఉన్న 52 అసెంబ్లీ సీట్లకు గానూ టీడీపీకి మూడంటే మూడు దక్కితే 49 సీట్లను వైసీపీ గెలుచుకుంది. ఇంతలా ఒక రాజకీయ పార్టీ పెర్ఫార్మ్ చేసింది గతంలో అయితే లేదు.

**దెబ్బకు కుదేలు :** అయితే 2024 నాటికి చూస్తే సీమ జిల్లాకు మొత్తం వైసీపీకి ఫేస్ టర్నింగ్ ఇచ్చుకున్నాయి. అలాగే వైసీపీనే నమ్ముకుని రెండు సార్వత్రిక ఎన్నికల్లో బలంగా నిలబడిన ఒక కీలక సామాజిక వర్గం సైతం మాకెందులు లెమ్మని పట్టనట్లుగా ఉండిపోయింది.

దీంతో రాయలసీమలోని మొత్తం సీట్లలో ఏడంటే ఏడు మాత్రమే వైసీపీకి దక్కాయి. అలా కూటమి దెబ్బకు ఫ్యాన్ పార్టీ ఒక్క లెక్కన కుదేల్ అయిపోయింది.

**పెరిగిన టీడీపీ :** మరో వైపు చూస్తే కాంగ్రెస్ హయాంలోనూ ఇంకా చెప్పాలంటే వైసీపీ పుట్టాక గెలవని సీట్లలోనూ 2024 ఎన్నికల్లో గెలిచి సత్తా చాటింది. దాంతో టీడీపీకి సీమలో గ్రాఫ్ బాగా పెరిగింది. దానిని పదిలపరచుకునే పనిలో అపర చాణక్యుడు చంద్రబాబు ఉన్నారు. రాయలసీమలో కనుక వైసీపీ కూసాలు కదిలిస్తే మాత్రం 2029లోనూ అద్భుతమైన విజయాలు టీడీపీ కూటమికి దక్కుతాయని లెక్క వేస్తున్నారు. నిన్నటి దాకా వైసీపీ వెంట ఉంటూ అన్ని విధాలుగా అండగా నిలిచిన ఒక బలమైన సామాజిక వర్గాన్ని సైతం ఆకట్టుకునే పనిలో టీడీపీ ఉంది. ఇందులో చాలా వరకూ సక్సెస్ అయింది.

**కడపలో మహానాడుతో :** ఇక కడపలో మహానాడుని టీడీపీ అత్యంత గ్రాండ్ గా నిర్వహించి జగన్ ఇలాకాలో తన తడాఖా చూపించింది. ఇక లేటెస్ట్ గా చూస్తే పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిచి వైసీపీని పూర్తిగా చతికిలపడేలా చేసింది. ఇపుడు రెట్టించిన ఉత్సాహంతో రాయలసీమ మీద ఫుల్ ఫోకస్ పెట్టేసింది. తాజాగా చూస్తే కనుక ఈ నెల 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవాలను నిర్వహించాలని టీడీపీ కూటమి నిర్ణయించింది.

ఇక్కడ ఈ విజయోత్సవ సభను నిర్వహించడం ద్వారా రాయలసీమ మొత్తం కూటమి సక్సెస్ ని రీ సౌండ్ తో వినిపించాలని బాబు మాస్టర్ ప్లన్ నే వేశారు అని అంటున్నారు.

**వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్ లో హవా :** ఈ రోజున చూస్తే వైసీపీకి జగన్ సొంత జిల్లా కడపలోనే ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని అంటున్నారు. అనంతపురంలో చూస్తే టీడీపీ ఏకపక్షంగానే విజయాలు సాధిస్తోంది. అలాగే కర్నూల్, చిత్తూరు లో కూడా తన పట్టుని పెంచుకుంటూ వస్తోంది. వరసగా చంద్రబాబు లోకేష్ రాయలసీమ జిల్లాలలో పర్యటనలు చేస్తూ వస్తున్నారు. ప్రజలతో మమేకం అవుతున్నారు. బనకచర్ల ద్వారా సాగు నీటిని ఇస్తామని శాశ్వతంగా కరవు లేకుండా చూస్తామని చెబుతున్నారు. హార్టీ కల్చర్ హబ్ గానూ పారిశ్రామికంగానూ రాయలసీమను నిలుపుతామని చెబుతున్నారు.

ఈ విధంగా వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో వచ్చే ఎన్నికల్లో తమ హవా ఇదే తీరున కొనసాగిస్తే ఫ్యాన్ పార్టీకి రాజకీయంగా ఇబ్బందులే అన్నది టీడీపీ వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే నిన్న కడపలో మహానాడుని నిర్వహించారు. ఈ నెల 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవాలకు వేదికగా ఎంపిక చేసుకున్నారు అని అంటున్నారు.

# ఆరోగ్య శ్రీ ప్రైవేటు పరం.. కష్టమా..నష్టమా..?




అమరావతి : ఆరోగ్యశ్రీని ప్రైవేటుపరం చేస్తూ తాజాగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఎల్ఐసి వంటి సంస్థలకు ఆరోగ్యశ్రీని విడతలవారీగా అప్పగించే కార్యక్రమానికి దాదాపు శ్రీకారం చుట్టినట్టు అయింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 25 లక్షల రూపాయల మేరకు ఆరోగ్య సంజీవిని పేరుతో భీమాను అమలు చేస్తోంది. ఇప్పుడు దీనికి అటాచ్ చేస్తూ ఆరోగ్యశ్రీని ప్రైవేటుకు అప్పగించడం ద్వారా రెండున్నర లక్షలు, ఐదు లక్షలు అదేవిధంగా 10 లక్షల నుంచి 15 లక్షలు 20 నుంచి 25 లక్షల వరకు భీమాను కల్పిస్తూ ప్రైవేటు సంస్థలకు ఇచ్చేయాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. కానీ, వాస్తవానికి ఇట్లా చేయటం ఎంతవరకు మంచిది. పేదలకు చేరువైన పథకం దూరమైతే ప్రభుత్వం మీద ఎంతవరకు ఎఫెక్ట్ పడుతుందన్నది చర్చనీయాంశం. వైయస్సార్ తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు 2004లో తీసుకువచ్చిన ఆరోగ్య శ్రీ పథకం అనేకమంది పేదలకు చేరువయ్యింది. అనేకమంది పేదల జీవితాలను నిలబెట్టింది. అటువంటి పథకాన్ని గత ప్రభుత్వాలు.. ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగించాల్సిన అవసరం ఉంది. కానీ.. అనూహ్యంగా ఆరోగ్యశ్రీ ప్రైవేటుపరం చేస్తూ ఎల్ఐసి వంటి సంస్థలకు అప్పగించడం ద్వారా రేపు పేదలకు ఏ మేరకు మేలు జరుగుతుందని ప్రశ్న. వాస్తవానికి ఎల్ఐసి అంటే లాభా పేక్ష లేని సంస్థ అయితే కాదు. లాభం లేకుండా ఏ సంస్థ పనిచేయదు. ఆరోగ్యశ్రీని అలా కాకుండా పేదలకు కేవలం సేవ చేయాలన్న ఉద్దేశంతో వైయస్ రాజశేఖర్ రెడ్డి తీసుకు వచ్చిన కీలక పథకం. ఇది ఆయనకు పేరు తెచ్చింది. అదేవిధంగా ప్రభుత్వాన్ని వరుసగా రెండుసార్లు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. దీనిని గుర్తించే గత టిడిపి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని కొనసాగించింది. తెలంగాణలో కూడా బిఆర్ఎస్ హయాంలోనూ ఈ పథకం అమలైంది. ఇప్పుడు అమలు అవుతోంది. కానీ, ఏపీకి వచ్చేసరికి మాత్రం దీన్ని ప్రైవేటుపరం చేస్తూ కేంద్ర అమలు చేస్తున్న ఆరోగ్య సంజీవని ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో లింక్అప్ చేయటం ద్వారా ఎల్ఐసి వంటి సంస్థలకు ఇవ్వడం ఎంతవరకు మేలు చేస్తుంది అన్నది చూడాలి. ప్రస్తుతానికైతే ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎత్తివే స్తే కచ్చితంగా పేదల్లో తిరుగుబాటు వస్తుంది అన్నది రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. ఎందుకంటే ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ సంస్థల్లో వాళ్లకు మేలైన వైద్యం అందుతోంది. కొంత లోకొంత వెనకబాటు ఉన్నప్పటికీ.. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా ఇప్పుడు ప్రైవేటుపరం చేస్తే అది ప్రభుత్వానికి ఖచ్చితంగా ఇబ్బందికర పరిస్థితి వస్తున్నది విశ్లేషకులు చెబుతున్న మాట. మరి ఏం చేస్తారనేది చూడాలి. ఇప్పటికైతే ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటుకు ఇచ్చేందుకే ప్రభుత్వం మగ్గుచూపుతోంది. ఇది వచ్చే ఎన్నికలనాటికి ప్రభుత్వానికి పెద్ద శాపంగా మారినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నది విశ్లేషకుల మాట. మరి ఏం జరుగుతుందో చూడాలి.




దిల్లీలోని ఎర్రకోటలో భారీ దొంగతనం జరగడం కలకలం రేపింది. ఇటీవల ఎర్రకోటలో జరిగిన ఓ మతపరమైన కార్యక్రమంలో రూ.కోటి విలువగల రెండు కలశాలు చోరీకి గురైనట్లు అధికారులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 3న ఉదయం ఎర్రకోటలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది.

కార్యక్రమం అనంతరం పూజ కోసం తాను తీసుకువచ్చిన 760 గ్రాములు బంగారు కలశం, వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలతో పొదిగిన 115 గ్రాముల మరో చిన్న బంగారు కలశం కనిపించలేదని వ్యాపారవేత్త సుధీర్ కుమార్ జైన్ ఎర్రకోట నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. పూజా కార్యక్రమానికి ప్రముఖులు హాజరవ్వడంతో తాము పక్కకు వెళ్లామని.. అంతలోనే ఈ దొంగతనం జరిగిందని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి పూజాసామగ్రి ఉన్న గదిలోకి వెళ్లి.. రెండు కలశాలను సంచిలో వేసుకుంటున్న దృశ్యాలు కనిపించాయి. అనంతరం అతడు అక్కడి నుంచి బయటకు జారుకున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దీంతో కేసు నమోదు చేసి.. గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడిపై ఇప్పటికే పలు ఆలయాల్లో దొంగతనానికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కలశాలను దొంగలిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# లిక్కర్ కేసులో కీలక పరిణామం.. ముగ్గురికి బెయిల్..




విజయవాడ: ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మద్యం కుంభకోణంలో కేసులో నిందితులుగా ఉన్న ఏ31-ధనుంజయ రెడ్డి, ఏ32-కృష్ణ మోహన్ రెడ్డి, ఏ-33 బాలాజీ గోవిందప్పలకు ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ సంచలన తీర్పు వెలువరించింది. ముగ్గురు నిందితులు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరువర్గాల వాదనలు ముగిసినట్లు తెలిపింది. ఈ మేరకు ఇవాళ(శనివారం) ముగ్గురికీ బెయిల్ మంజూరు చేస్తూ.. ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు మే 14న బాలాజీ గోవిందప్ప, మే 17న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలను సిట్ అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో ముగ్గురు బెయిల్ కోసం.. ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఏసీబీ కోర్టు విచారణ చేపట్టింది. ఈ మేరకు ఇవాళ(శనివారం) బెయిల్ మంజూరు చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే.. ముగ్గురు పాస్‌పోర్ట్‌లు అధికారులకు అప్పగించాలని కోర్టు ఆదేశించింది. ఒక్కొక్కరు లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని తెలిపింది. జగన్ ప్రభుత్వం హయాంలో మద్యం విక్రయాల లావాదేవీలన్ని నేరుగా జరిగాయి. అంటే ఎక్కడ డిజిటల్ చెల్లింపులు అనేవి జరగలేదు. దీంతో ఈ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాలకు తెర తీశారు. ఈ మద్యం తాగడం వల్ల అనేక మంది మృత్యువాత పడ్డారు. అలాగే పలువురు అనారోగ్యానికి గురయ్యారు. అంతేకాకుండా.. ఈ మద్యం విక్రయాల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి.

ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం కుంభకోణంపై సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిను సిట్ అధికారులు అరెస్ట్ చేసి.. విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు అరెస్ట్ చేశారు.




**చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం అగరాల సమీపంలో ముందు వెళ్తున్న గ్రానైట్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో 30 మందికి గాయాలయ్యాయి. బస్సు బెంగళూరు నుంచి తిరుపతికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో అందులో 48 మంది ప్రయాణికులున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.**

# జగన్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయి..




అమరావతి: వైద్య రంగం నిధులను దోపిడి చేసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తన ధన దాహాన్ని తీర్చుకున్నారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా భ్రష్టుపడ్డ.. అనేక వ్యవస్థలను తిరిగి స్థాపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తీవ్ర కృషి జరుగుతోందని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి అవినీతి దాహానికి బలి అయిపోయిన రంగాలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

**వైద్యరంగం నిర్లక్ష్యం...** గత ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో వైద్యశాఖ తీవ్రంగా దెబ్బతిన్నట్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. దాని పర్యవసానాలను కోవిడ్ సమయంలో అందరూ ప్రత్యక్షంగా అనుభవించారని చెప్పుకొచ్చారు. 14 సంవత్సరాల ముఖ్యమంత్రి కాలంలో చంద్రబాబు రాష్ట్రానికి 22 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి ఐదు సంవత్సరాలలో కేవలం ఐదు కాలేజీలను మాత్రమే తెచ్చారని విమర్శించారు. అవి కూడా నిర్మాణాలు పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి అసంపూర్ణంగా వదిలిపోయిన కాలేజీ నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు. ఇంకా అదనంగా 10 కొత్త మెడికల్ కాలేజీలను పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య మోడల్‌లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

**జగన్ ఊరువాడా డప్పు కొడుతున్నారు..** అయితే.. 17 మెడికల్ కాలేజీలు తెచ్చానని ఊరువాడా డప్పు కొట్టుకుంటున్న జగన్మోహన్ రెడ్డి రూ.8,480 కోట్లకు గాను కేవలం రూ.1,451 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. ఇందులో రూ.975 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందించిందని పేర్కొన్నారు. జగన్ రెడ్డి నియోజకవర్గం పులివెందుల కాలేజీకి రూ.168 కోట్లు పెండింగ్ వర్క్స్ ఉన్నాయని తెలిపారు. జాతీయ వైద్య మండలి పాడేరు, మార్కాపూరు, మదనపల్లి, ఆదోని, పులివెందుల్లోని కళాశాలల నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేసిందని ఆయన చెప్పుకొచ్చారు.




పాలకొల్లు: సమాజంలో ప్రజలను చైతన్యపరిచి, సామాజిక రుగ్మతలను తొలగించేందుకు లఘు చిత్రాలు వేదికగా నిలుస్తున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సామాజిక బాధ్యతను గుర్తు చేయడంతో పాటు వినోదాన్ని కలిగిస్తున్నాయని చెప్పారు. పాలకొల్లులో జాతీయ తెలుగు సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నాలుగో అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీలు నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. “నిడివి తక్కువ గల లఘు చిత్రాలు సమాజానికి మంచి సందేశాలు అందిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్లు వచ్చాక వీటికి విపరీతమైన ఆదరణ పెరిగింది. నేటి యువతలో దాగిఉన్న సృజనాత్మకతను, కొత్త ఆలోచనలను వెలికితీసేందుకు ఇవి దోహదపడుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం తోడవడంతో ఎన్నో అద్భుత లఘు చిత్రాలను యువత ఆవిష్కరిస్తున్నారు. వీటి ద్వారా కొత్త దర్శకులు, నటీనటులు తమ ప్రతిభ కనబరుస్తున్నారు. చిత్ర పరిశ్రమలో పాలకొల్లు నుంచి దాసరి, కోడి రామకృష్ణ, అల్లు రామలింగయ్య, అనంత శ్రీరామ్, రేలంగి... ఇలా ఎందరో కళాకారులు రాణించారు” అని నిమ్మల రామానాయుడు తెలిపారు.

# అపురూప దృశ్యం.. నీలకంఠుడికి కృష్ణమ్మ జలాభిషేకం..




పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కాట్రపాడులోని కృష్ణా నది ఒడ్డున ఓ అపురూప దృశ్యం చోటుచేసుకుంది. కృష్ణా నది ఒడ్డున ఉన్న నీలకంఠుడి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్నట్లుగా వరదనీరు తాకుతూ ఉన్న దృశ్యం అందరినీ ఆకట్టుకుంటోంది. గతంలో కృష్ణా పుష్కరాల సమయంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా నదిలో వరద ఉధృతి పెరగడంతో నీరు శివుని కంఠాన్ని తాకుతూ ప్రవహిస్తోంది. ఈ దృశ్యాలను స్థానికులు తమ ఫోన్లు, కెమెరాల్లో బంధించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.

# రెండు కళ్లు మూసుకున్నా.. లాగు మరి నీ వైపు!

రమ్య పసుపులేటి.. పేరుకు తగ్గట్టే అందం అభినయంతో ఆకట్టుకున్న నేటితరం తెలుగమ్మాయి. 2018లో హుషారు సినిమాతో తెరంగేట్రం చేసిన ఈ బ్యూటీ కమిట్‌మెంట్ (2020), పంచాక్షరి (2019), (MAD)≤ (2024), మారుతి నగర్ సుబ్రమణ్యం లాంటి చిత్రాలలో నటించింది. వెబ్ సిరీస్ BFFలోను తనదైన నటనతో ఆకట్టుకుంది. పలు వాణిజ్య ప్రకటనలలో కనిపించింది. డిజిటల్ మాధ్యమాల్లో బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించింది. రమ్య ఆల్ రౌండర్ నైపుణ్యం అభిమానులను ఎంతగానో ఆశ్చర్యపరుస్తుంది. తన నటనా



వృత్తికి మించి రమ్య పసుపులేటి ఒక స్పెషలిస్ట్ ఫ్యాషన్ బ్లాగర్.. సోషల్ మీడియా పర్సనాలిటీ. నేటితరానికి స్ఫూర్తినిచ్చే ఫ్యాషన్ కంటెంట్ సృష్టికర్త. రమ్య ఫ్యాషన్ కంటెంట్ దక్షిణ భారతదేశం అంతటా యూత్ కు స్ఫూర్తి. రమ్య ఫ్యాషన్ సెన్స్ ట్రెడిషన్ ఎంతో ప్రత్యేకమైనవి. తాజాగా ఇన్ స్టా మాధ్యమంగా రమ్య పసుపులేటి షేర్ చేసిన శారీ లుక్ వైరల్ గా దూసుకెళుతోంది.

వాలు కనులతో మాయ చేస్తున్న ఈ బ్యూటీ, చీరలో ముగ్ధమనోహర రూపంతో కట్టి పడేస్తోంది. రెండు కళ్లు మూసుకున్నా.. లాగు మరి నీ వైపు! అనే క్యాప్షన్ తో టీజ్ చేసింది రమ్య. ఈ బ్యూటీ తదుపరి ప్రాజెక్టుల గురించిన వివరాలు తెలియాల్సి ఉంది.

## ఘాటీతో క్రిష్ సొసైటీని మార్చేస్తాడా?

టాలీవుడ్ క్వీన్, స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కిన మోస్ట్ అవెయిటెడ్ యాక్షన్ డ్రామా మూవీ ఘాటీ. విక్రమ్ ప్రభు మేల్ లీడ్ గా నటించిన ఈ సినిమాకు క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించిన ఘాటీ సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**స్వీటీ రాకపోవడంతో భారమంతా టీమ్ మీదే...** లీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను వేగవంతం చేసింది. అనుష్క ప్రమోషన్స్ కు రాకపోవడంతో ఆ భారమంతా దర్శకనిర్మాతలు, ఇతర క్యాస్ట్ పై పడటంతో అందరూ ఆ పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న డైరెక్టర్ క్రిష్ ఘాటీ గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడిస్తూ సినిమాను వార్తల్లో నిలుపుతున్నారు.

**గంజాయి స్మగ్లింగ్ పై ఘాటీ...** సమాజం ఎదుర్కొంటున్న ఓ పెద్ద సమస్యను ఘాటీలో చూపించామని, గంజాయి స్మగ్లింగ్ ఇప్పుడు స్కూల్స్ కు కూడా చేరుకుందని, ఈ గంజాయి స్మగ్లింగ్ రవాణా చాలా పెద్దదని,



ఈ సబ్జెక్టును హీరో యాంగిల్ నుంచి కాకుండా హీరోయిన్ యాంగిల్ నుంచి చూపిస్తే ఆడియన్స్ కు బాగా కనెక్ట్ అవుతుందనిపించిందని, ఈ డెసిషన్ ఎందుకు తీసుకున్నానో సినిమా చూశాక ప్రతీ ఒక్కరికీ అర్థమవుతుందని డైరెక్టర్ క్రిష్ చెప్పారు.

**సరోజ క్యారెక్టర్ ను కంటిన్యూ చేద్దామనుకున్నా...** ఘాటీ స్టోరీ లైన్ మైండ్ లో పుట్టినప్పటినుంచి దాన్ని అనుష్క తోనే చేయాలనుకున్నానని, వేదం తర్వాత మరో సినిమా చేయాలని ఇద్దరం అనుకున్నామనీ, వేదంలోని సరోజ క్యారెక్టర్ ను కంటిన్యూ చేయాలని కూడా అనుకున్నాననీ కానీ స్టోరీ ఆర్గానిక్ గా ఉండాలని వెయిట్ చేశానని, ఆ టైమ్ లోనే ఘాటీ ఆలోచన వచ్చిందని, సినిమాలో శీలావతి క్యారెక్టర్ కు అనుష్క యాటిట్యూడ్, గ్రేస్, బాడీ లాంగ్వేజ్ పర్ఫెక్ట్ గా సూటయ్యాయని క్రిష్ చెప్పారు.





# ప్రభాస్ వర్సెస్ రజనీ.. మళ్లీ బాక్సాఫీస్ క్లాష్





రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్ లతో బీజీగా ఉన్నారు. ఐదు పాన్‌ఇండియా సినిమాలు లైన్ లో పెట్టారు. అందులో ముందుగా రాజాసాబ్ విడుదల కానుంది. ఈ చిత్రం జనవరి 09న రిలీజ్ కు రెడీ అవుతుంది. దీనిత తర్వాత హను రాఘవపూడితో ఆయన ఫౌజీ చేస్తున్నారు. ఈ సినిమా ఇప్పిటికే ప్రారంభమమైంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇప్పటికే ప్రభాస్ పై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు.

ఈ సినిమా పీరియాడిక్ డ్రామా గా తెరకెక్కుతుంది. ఇందులో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రభాస్ ను ఇప్పటిదాకా డార్లింగ్ గా చూసిన అభిమానులు ఇందులో వారియర్ గా చూడనున్నారు. ప్రముఖ ప్రొడక్షన్ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తుంది. అయితే హను రాఘవపూడి ఇదివరకు తెరక్కించిన సీతారామం మంచి సక్సెస్ అందుకుంది. ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించింది. ఈ సినిమాలో కూడా ప్రభాస్ కు ఓ అందమైన ప్రేమ కథతో పాటు వారియర్ గా చూపించనుండడంతో అంచనాలు పెరిగిపోయాయి. ఇక ఈ సినిమా షూటింగ్ వీలైనంత త్వరగా కంప్లీట్ చేసుకొని.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు చూసుకోవాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే బ్యాలెన్స్ పనులన్నీ పూర్తి చేసి 2026 ఆగస్టు 13న థియేటర్లలోకి వచ్చేలా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇండిపెండెన్స్ వీకెండ్ ను వాడుకోవాలని భావిస్తున్నారు. అయితే ఇలాంటి పెద్ద సినిమా సోలోగా రావాలని అనుకుంటారు ఎవరైనా. కానీ, ఇక్కడే చిక్కు వచ్చి పడింది. అదే ఆగస్టు 13ను రజనీకాంత్ జైలర్ 2 వాడుకోవాలని చూస్తోంది. అటు కోలీవుడ్ లో రజనీ బడా స్టార్. ఆయనకు బాక్సాఫీస్ క్లాష్ లు కొత్తేం కాదు. కానీ ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

తొలి పార్ట్ బ్లాస్ బస్టర్ అయినందున సీక్వెల్ పై హైప్ ఉంది. అయితే రీసెంట్ గా రజనీ .. వార్ 2తో పోటీకి వచ్చారు. ఈ రేస్ లో రజనీ నెగ్గినప్పటికీ.. అనుకున్నంత కలెక్షన్ రాలేదన్నది నిజం. అందుకే ఎవరైనా సోలో రిలీజ్ చూసుకుంటే బెటర్. ఇంకా టైమ్ ఉంది కాబట్టి చూద్దాం. ఎవరైనా తగ్గుతారు ఏమో.

# రూ.30 కోట్ల సినిమా రూ.200 కోట్లకు పరుగులు





కరోనా తర్వాత సినిమా ఇండస్ట్రీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న విషయం తెల్సిందే. దేశవ్యాప్తంగా థియేటర్లకు జనాలు రావడం చాలా తగ్గిందని, 2020 కి ముందుతో పోల్చితే గడచిన ఐదేళ్లలో థియేటర్‌కి వచ్చే వారి సంఖ్య దాదాపుగా 40 నుంచి 50 శాతం తగ్గిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకే చాలా సినిమాలు పాజిటివ్ టాక్ దక్కించుకున్నా మినిమం వసూళ్లు సైతం రాబట్టలేక పోతున్నాయి. బాలీవుడ్‌కి చెందిన స్టార్ హీరోల సినిమాలు మినిమం వసూళ్లు సాధించలేక కింద మీద పడ్డ సందర్భాలు ఈ ఐదేళ్ల కాలంలో చాలా చూశాం. అయితే కొన్ని చిన్న సినిమాలు, కంటెంట్ బేస్డ్ సినిమాలు మాత్రం బాక్సాఫీస్‌ను దున్నేస్తున్నాయి. హిందీలోనే కాకుండా ఇతర భాషల్లోనూ వచ్చిన చిన్న సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకుని వందల కోట్ల వసూళ్లు సాధించిన దాఖలాలు చాలానే ఉన్నాయి.

**లోకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్...** కంటెంట్‌కి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతారు అని మరోసారి నిరూపించిన చిన్న చిత్రం 'లోకా : చాప్టర్ 1'. ఈ సినిమా మలయాళంలో రూపొంది ప్రస్తుతం అన్ని భాషల్లోనూ తెగ సందడి చేస్తూ ఉంది. లేడీ ఓరియంటెడ్ మూవీగా విడుదలైన ఈ సినిమా మలయాళ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన లేడీ ఓరియంటెడ్ సినిమాగా ఇప్పటికే నిలిచింది. మొదటి వారం రోజుల్లో దాదాపు రూ. 100 కోట్ల వసూళ్లు రాబట్టడం ద్వారా అరుదైన రికార్డ్‌ను ఈ సినిమా సొంతం చేసుకుంది. లాంగ్ రన్‌లో ఈజీగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధిస్తుందని అంటున్నారు.

ఇప్పటి వరకు తమిళ ప్రేక్షకులు మాత్రం లోకా సినిమా ను చూశారు, రాబోయే రోజుల్లో ఇతర భాషల ప్రేక్షకులు సైతం ఈ సినిమా ను చూడబోతున్నారు. కనుక ఖచ్చితంగా లోకా సినిమా రూ. 200 కోట్లకు మించి వసూళ్లు రాబట్టడం పెద్ద కష్టం ఏమీ కాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

**కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా...** ఇప్పటి వరకు సౌత్ ఇండియాలో వచ్చిన లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో చాలా తక్కువ మాత్రమే వంద కోట్ల వసూళ్లకు చేరువ అయ్యాయి. కానీ లోకా సినిమా మాత్రం ఏకంగా వంద కోట్ల వసూళ్లు క్రాస్ చేసి, రూ. 200 కోట్ల వసూళ్ల దిశగా దూసుకు పోతుంది. తక్కువ సమయంలోనే ఎక్కువ వసూళు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సినిమాగా అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. లోకా సినిమాలో హీరోయిన్ గా నటించిన కళ్యాణి ప్రియదర్శన్ ఆకట్టుకుంది. ఆమె కెరీర్ ఆరంభం అయ్యి చాలా సంవత్సరాలు అయింది. ఇన్నాళ్లకు ఒక బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ దక్కింది. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు మంచి అవకాశం ఈ సినిమాతో దక్కింది. ఈ థ్రిల్లర్ సినిమాలో చంద్ర పాత్రను ఆమె పోషించడం ద్వారా మంచి పేరును సొంతం చేసుకుంది.

**దుల్కర్ సల్మాన్ నిర్మాణంలో లోకా...** డొమినిక్ అరుణ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను ప్రముఖ హీరో దుల్కర్ సల్మాన్ సొంత బ్యానర్‌లో నిర్మించాడు. లోకా సినిమా ను ఒక ఫ్రాంచైజీ గా దర్శకుడు రూపొందించబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించాడు. అందులో భాగంగా వచ్చిన మొదటి సినిమా ఇది. లోకా చాప్టర్ 1 : చంద్ర సినిమాను చూసిన ప్రతి ఒక్కరూ లోకా చాప్టర్ 2 ఎప్పుడు వస్తుందా అనే ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ముందు ముందు ఈ యూనివర్శ్‌లో రాబోతున్న సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకుంటాయి అని నమ్మకం వ్యక్తం అవుతోంది. ఈ సినిమాను ముందుగానే పాన్ ఇండియా రేంజ్‌లో ప్లాన్ చేసి ఉండాల్సిందని కొందరు అంటున్నారు. కేవలం రూ. 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ ద్వారా దాదాపుగా రూ. 200 కోట్లను రాబట్టే అవకాశాలు ఉన్నాయి. ఇతర మార్గాల ద్వారా సినిమా మరో రూ. 50 కోట్లకు మించి రాబట్టిన ఆశ్చర్యం లేదు. అంటే కంటెంట్ బాగుంటే సినిమా ఏ స్థాయిలో బిజినెస్ చేస్తుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

# పాలక్ అందచందాలకు పరేషాన్


ప్రముఖ టీవీ నటి శ్వేతా తివారీ నటవారసురాలు పాలక్ తివారీ పరిచయం అవసరం లేదు. సైఫ్ అలీఖాన్ నటవారసుడు ఇబ్రహీం అలీఖాన్ గాళ్ ఫ్రెండ్ గా ఈ అమ్మడి పేరు ఇటీవల ఎక్కువగా వార్తల్లో నిలిచింది. పాలక్ బిజ్లీ బిజ్లీ అనే మ్యూజిక్ వీడియోతో వెలుగులోకి వచ్చింది. అటుపై సల్మాన్ ఖాన్‌తో కలిసి కిసి కా భాయ్ కిసి కి జాన్ (2023) చిత్రంతో తెరంగేట్రం చేసింది. హారర్ థ్రిల్లర్ చిత్రం ది భూత్నీ (2025), రోమియో %బా%3లలో కూడా నటించింది. స్టార్ కిడ్ అయినా పాలక్ తనకు తానుగా సినీ రంగంలో ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పింది. సుహానా ఖాన్, అనన్య పాండే వంటి సహనటీమణులతో పోలుస్తూ నేపో కిడ్ అనే ట్యాగ్ ని మోయాల్సి వస్తున్నా, తాను స్వయంకృషితో ఎదగాలనే పట్టుదలను



కనబరుస్తోంది. కానీ ఇప్పటికీ పాలక్ ఆరంభ కష్టాలను ఎదుర్కొంటోంది. అయితే పాలక్ పేరు ఇటీవల ఇబ్రహీంతో డేటింగ్ వ్యవహారమై ఎక్కువగా ప్రచారంలోకి రావడంతో తన తండ్రి (తల్లి నుంచి విడిపోయారు) రాజా చౌదరి కుమార్తెకు సూచిస్తూ.. డేటింగుల కంటే నటన, హార్డ్ వర్క్‌పై దృష్టి సారించాలని అన్నారు. మరోవైపు పాలక్ ఇతర నటీమణులతో పోటీపడుతూ సోషల్ మీడియా ల్లో వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. తాజాగా పాలక్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో హాట్ టాపిగ్గా మారింది. పాలక్ అందమైన నియాన్ గ్రీన్ ఫ్రాక్ లో ముచ్చటగా కనిపిస్తోంది. ఇది జీక్యూ ఇండియా కోసం ఫోటోషూట్ అంటూ పాలక్ వెల్లడించింది. దీనిలో హాఫ్ షోల్డర్ డ్రెస్ లో పాలక్ అందచందాల ఎలివేషన్ ప్రధానంగా హైలైట్ అయింది. అయితే ఇటీవలి వరుస ఫోటోషూట్లను పరిశీలిస్తే, పాలక్ పూర్తిగా నటనా కెరీర్ కంటే ఫోటోషూట్లపైనే ఫోకస్ చేస్తోందనే విమర్శలు కూడా వస్తున్నాయి. అయితే అన్నిటికీ చెక్ పెట్టే ఒక గ్రేట్ ఛాన్స్ కోసం పాలక్ ఎదురు చూస్తోంది. ఈ భామ కెమెరా ఎదుట అడుగుపెట్టడానికి ముందే యాంటిమ్: ది ఫైనల్ ట్రూత్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పనిచేసింది. మునుముందు నటిగా పెద్ద స్థానం కోసం ప్రయత్నిస్తోంది. దానికి పరిస్థితులు సహకరించాల్సి ఉంది. తన జాతకాన్ని మార్చే ఆ ఒక్క ఛాన్స్ కోసమే ఈ వెయిటింగ్.

## పింక్ అవుట్ ఫిట్ లో మెస్మరైజ్ చేస్తున్న బాలయ్య బ్యూటీ!

ప్రస్తుతం సినీ సెలబ్రిటీలు ఎక్కువగా సోషల్ మీడియాను ఫాలో అవుతున్నారు. అందులో భాగంగానే అకేషన్ ఏదైనా సరే అందుకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఇంకొంతమంది ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి గ్లామర్ ఫోటోలను షేర్ చేయడమే కాకుండా.. చిత్రవిచిత్రమైన దుస్తులు ధరిస్తూ అలరిస్తున్నారు. ఇంకొంతమంది అందాలు ఆరబోసేలా ఫోటోలు షేర్ చేస్తే.. మరికొంతమంది సాంప్రదాయంగా కనిపించి అబ్బురపరుస్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి బాలయ్య బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ కూడా వచ్చి చేరింది. ఇంస్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను ఈ ముద్దుగుమ్మ షేర్ చేసుకుంది. అందులో తన అవుట్ ఫిట్ తో అందరినీ ఆకట్టుకుంది అని చెప్పవచ్చు.



అసలు విషయంలోకి వెళ్తే.. ప్రముఖ నటి, మోడల్ అంజనా బోహ్రా ప్రత్యేకంగా డిజైన్ చేసిన పింక్ కలర్ లెహంగా సెట్ ను ప్రగ్యా జైశ్వాల్ ధరించింది. ముఖ్యంగా పెళ్లికి , పండుగలకు ప్రత్యేకంగా దుస్తులు డిజైన్ చేయడంలో ప్రసిద్ధి చెందిన అంజనా తాజాగా ప్రగ్యా జైశ్వాల్ కోసం.. పింక్ కలర్ పట్టు వస్త్రంపై క్లిష్టమైన ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్ తో డిజైన్ చేసిన లెహంగాను రూపొందించింది. ఇది ధరించిన ప్రగ్యా జైశ్వాల్ తన అందాన్ని దుస్తులతో మరింత రెట్టింపు చేసుకుందని చెప్పవచ్చు. పింక్ కలర్ లెహంగా ఈమె మేనిఛాయను మరింత మెరిసేలా చేస్తూ.. చూపరులను కూడా ఆకట్టుకుంది. ప్రస్తుతం ప్రగ్యా జైశ్వాల్ ధరించిన ఈ అవుట్ ఫిట్ అభిమానులను మరింత అలరిస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నా యి.




## ట్యాంక్‌బండ్‌కు సీఎం రేవంత్.. గణేశ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్: నగర వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ వద్ద జరుగుతున్న గణేష్ నిమజ్జనాల వేడుకను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వయంగా ట్యాంక్‌బండ్‌కు సీఎం వచ్చినట్లు సమాచారం. నిమజ్జనాల నేపథ్యంలో అధికారులు చేసిన భద్రత ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అనంతరం ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సాధారణ వ్యక్తిగా ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించారు. రేవంత్ రెడ్డి రావడంతో భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రజలకు అభివాదం చేస్తూ.. ముందుకు కదిలారు. అత్యంత తక్కువ సంఖ్యలో భద్రత సిబ్బందితో.. మూడు కార్ల ఎస్కార్ట్‌తో సీఎం ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. నిమజ్జనం జరుగుతున్న తీరును అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. వినాయక నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సీఎం స్పష్టం చేశారు.




## గంగమ్మ ఒడికి బడాగణేశ్.. ఘనంగా ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన ప్రక్రియ

ఖైరతాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్మాత్మకమైన ఖైరతాబాద్ బడా గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎన్టీఆర్ మార్గ్‌లోని బాహుబలి క్రేన్ పాయింట్ 4 వద్ద నిమజ్జనోత్సవాన్ని చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల జయజయధ్వానాల మధ్య మహాగణపతికి ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకుముందు వినాయకుడికి ఉత్సవ సమితి నిర్వాహకులు తుది పూజలు నిర్వహించారు. ఇక ఈ ఉదయం 7 గంటలకు బడా గణేశ్ శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. రాజ్‌దూత్ సర్కిల్, టెలిఫోన్ భవన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా వినాయకుడు ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో శోభాయాత్ర మార్గంతోపాటు ఎన్టీఆర్ మార్గ్‌లో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

## కవితపై మంత్రి జూపల్లి సంచలన వ్యాఖ్యలు..

జోగులాంబ గద్వాల: జిల్లా కేంద్రంలో 2-BHK ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో.. మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాజీ ఎమ్మెల్సీ కవితపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత మాజీ సీఎం కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని అన్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు గుర్తు చేశారు. కవిత కూడా కొరివి దెయ్యమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని కవితనే చెప్పారని తెలిపారు. తాను ఆనాడు మంత్రి పదవి కోసం బీఆర్ఎస్ పార్టీలోకి రాలేదని పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని




పాతర వేసిందని విమర్శించారు. కవిత కొంత దాచిపెట్టి.. కొంత మూసిపెట్టి మాట్లాడుతున్నారని జూపల్లి ఆరోపించారు.

## కేసీఆర్ ప్రభుత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

వనపర్తి జిల్లా : కల్వకుంట్ల కుటుంబం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై మోపిందని ఆక్షేపించారు. ఇవాళ(శనివారం) వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెల నెల వడ్డీలు కడుతూనే.. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దులా ముందుకు తీసుకుపోతున్నామని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదవారిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని.. పాత రేషన్ కార్డుల్లో 17 లక్షల మంది పేర్లను చేర్చామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి రెండువేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చి ఉంటే అందరికీ ఇళ్లు వచ్చేవని



తెలిపారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఇళ్లు కడితే కమీషన్లు రావని తెలిసి మాజీ సీఎం కేసీఆర్ ఇళ్లను కట్టలేదని ఎద్దేవా చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కమీషన్లు వస్తాయని తెలిసి ఆ ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరంలో కేసీఆర్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాబోయే మూడు విడతల్లో ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.




హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్మాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. దీన్ని కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్‌ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉంది" అని దశరథగౌడ్ పేర్కొన్నారు.




హైదరాబాద్: ఇటీవల కవిత తనపై చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఉద్యమం నుంచి 25 ఏళ్లుగా తన ప్రస్థానం తెరిచిన పుస్తకమని పేర్కొన్నారు. "ఇటీవల కాలంలో నాపై, పార్టీ పై కొందరు ఆరోపణలు చేశారు. ఎందుకు చేశారో? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు చేశారో?. నాపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను. కేసీఆర్ గత పదేళ్లుగా నిర్మించిన ఒక్కో వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారు. రాష్ట్రంలో ఓ వైపు రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మంచివి కావు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే మా ముందున్న కర్తవ్యం" అని హరీశ్‌రావు అన్నారు.



## ఖమ్మం-దేవరపల్లి నేషనల్ హైవే... ఓ గేమ్ ఛేంజర్: మంత్రి తుమ్మల

ఖమ్మం: సూర్యాపేట నుంచి దేవరపల్లి నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. దంసలాపురం వద్ద జాతీయ రహదారి ఎంట్రీ, ఎగ్జిట్, మున్నేరు బ్రిడ్జి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి దేవరపల్లి నేషనల్ హైవే గేమ్ చేంజర్‌గా మారనుందన్నారు. ఉత్తర, దక్షిణ భారతాన్ని కలుపుతూ కనెక్టింగ్ హైవేగా ఖమ్మానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికే గేమ్ ఛేంజర్‌గా మారుతుందన్నారు. ఈ రహదారి పూర్తయితే ఖమ్మం నుంచి రాజమండ్రికి గంటన్నర సమయంలో ప్రయాణం చేయవచ్చని తెలిపారు. సూర్యాపేట నుంచి విజయవాడ వెళ్లకుండా ఖమ్మం మీదుగా విశాఖపట్నం, ఒడిశా వెళ్లేవారికి దాదాపు 150 కి.మీ ప్రయాణం తగ్గుతుందన్నారు. ఖమ్మం నగరంలోని దంసలాపురం ఎగ్జిట్ ప్రణాళికలో లేనందున పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. ఈ పనులతోపాటు మున్నేరు బ్రిడ్జి రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నవంబరు నాటికి పూర్తవుతాయని చెప్పారు. ఖమ్మం నుంచి కల్లూరు వరకు వ్యవసాయ పనులకు ఇబ్బందులు లేకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని హైవే అధికారులను మంత్రి ఆదేశించారు. రూ.3500 కోట్లతో నేషనల్ హైవే పనులు కొనసాగుతున్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## నిమజ్జనాలు.. ప్రజలు సహకరించాలి: డీజీపీ జితేందర్

హైదరాబాద్: మహానగరం హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్లు డీజీపీ జితేందర్ మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక బలగాలు విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు ప్రఖ్యాత ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయినట్లు తెలిపారు. బాలాపూర్ గణపతి శోభాయాత్ర ప్రారంభమైందని, నాలుగు గంటలోపు నిమజ్జనం పూర్తవుతుందని చెప్పారు. రేపటి వరకు నిమజ్జనాలు కొనసాగుతాయన్న జితేందర్.. ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

డీజీపీ కార్యాలయంతో పాటు బంజారాహిల్స్‌లోని ఐసీసీ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. ఈసారి ఎస్‌డీఆర్ఎఫ్ కూడా నిమజ్జన విధుల్లో పాల్గొందన్నారు.





## 13న బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఈ నెలాఖరు వరకు విస్తారంగా వర్షాలు

విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా ఏపీ, ఒడిశా, తెలంగాణ వైపు కదిలే అవకాశముందని, దీని ప్రభావంతో ఈ నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మరోవైపు రాబోయే 4 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని అమరావతి వాతావరణ విభాగం తెలిపింది. అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పెరిగింది. కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కావలి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రాబోయే బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని చెప్పింది. మరోవైపు మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా రాజస్థాన్, గుజరాత్ వైపు కదులుతూ ఆదివారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com